ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 ద్వారా ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వర్ణాంధ్ర-2047 నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి మంత్రితో పాటు కలెక్టర్ చామకూరి శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక ఎమ్మెల్యే కార్యాలయం ఏర్పాటు చేస్తారని, ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే ఆఫీస్ నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఈ నెల 12వ తేదీకి ఏడాది పూర్తవుతున్న శుభ సందర్భంగా ఆరోజు విజయవాడలో మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రాయలసీమలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. గోదావరి నీరు బనకచర్ల వరకు తీసుకొచ్చి హంద్రీనీవా, గాలేరు-నగిరి ఏవైతే పూర్తయ్యాయో వాటికి నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మన జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని తెలిపారు.

గోవధకు యత్నించిన వారిపై పోలీసు కేసు

● చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ మహేంద్ర



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం ఎర్రగన్నమిట్ట దిగువన గోవధకు యత్నించిన వారిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం గోవధ కోసం నాలుగు జెర్సీ ఆవులు, ఆరు కోడె దూడలు, ఒక ఆవును వధించేందుకు కొందరు తీసుకొచ్చారని, పోలీసులు వాటిని కాపాడి గోశాలకు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోలీసులు కేసు నమోదు చేయలేదని కొందరు ఆందోళనా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిసిందని, ప్రజలకు అసౌకర్యాలు కల్గిస్తూ ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

● రీసర్వేతో వందేళ్ల తర్వాత డిజిటల్ భూరికార్డు నమోదు
● వైసీపీ ప్రభుత్వంలో రీసర్వేతో గ్రామాల్లో సమస్యలు
● నేడు అధికారుల పర్యవేక్షణలో...



కలకడ మండలంలో సమగ్ర భూసర్వే పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ (ఫైల్)



పాసుపుస్తకంలో రైతు ఫొటో మారిన దృశ్యం

సంబేపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల తర్వాత చేపట్టిన రీసర్వేతో భూవివాదాల పరిష్కారం దిశగా అధికారులు చేపట్టారు. ప్రతి భూక్రమతలాన్ని అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా మార్కింగ్ చేసి ప్రతి భూమికి నెంబర్ ఇస్తూ క్యూఆర్ కోడ్ ఫిజికల్‌గా కాకుండా డిజిటల్‌గా రికార్డు నమోదు చేస్తుండడం వల్ల భూవివాదాలు పరిష్కారం కానున్నాయి. ఫీల్డ్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌ఎంబీ) ఆధారంగానే సర్వే నెంబర్లు ఉంటాయి. బ్రిటీష్ కాలం నుంచి సర్వే రాళ్లను కేంద్రంగా చేసుకుని నేటికీ భూములు కొలుస్తూ ఉంటారు. భూముల యజమానులు మారినా ఆయా భూములు పంపకాల వల్ల భాగాలను చేసి సర్వే నెంబర్లు మాత్రం అవే కొనసాగిస్తున్నారు. వందేళ్ల నాటి ఎఫ్‌ఎంబీ ఆధారంగా భూముల సర్వే నిర్వహణ చాలా ఆలస్యం అవుతోంది. భూరికార్డుల విషయంలో సమగ్రత లేకపోవడం వల్ల అనేక వివాదాలు జరుగుతున్నాయని తప్పుడు రికార్డుల ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు గుర్తించి రికార్డుల సమగ్ర పక్షాలను చేయాలని కేంద్ర ప్రభుత్వం రీసర్వే చేపడుతోందని అధికారులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 2022-23 సంవత్సరంలో రాష్ట్రంలో 3.31 కోట్ల ఎకరాల రీసర్వే కోసం రూ.1000 కోట్లు ఖర్చుతో 4,500 సర్వే బృందాలను ఏర్పాటు చేసి రీసర్వే చేపట్టారు. దీనికోసం డ్రోన్స్, ఓఆర్‌పీ పరికరాలు, రోవర్లు, హెలికాప్టర్లు వినియోగించారు. సర్వే బృందానికి తగిన గడువు ఇవ్వకపోవడంతో హడావుడి రీసర్వేతో గ్రామాల్లో అనేక తప్పిదాలు జరిగాయి. ప్రస్తుతం రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన అర్జీలే గత ప్రభుత్వ తప్పిదాలకు నిదర్శనం.

గ్రామసభల్లో సగం అర్జీలు అవే...

సంబేపల్లె మండలంలో ఆరు గ్రామాల్లో గత వైసీపీ ప్రభుత్వంలో సమగ్ర భూ రీసర్వే చేశారు. నారాయణరెడ్డిపల్లె, సంబేపల్లె, గున్నికుంట్ల, గురిగింజకుంట, రౌతుకుంట, మోటకట్ల గ్రామాల్లో చేపట్టారు. ఇటీవల జరిగిన రెవెన్యూ గ్రామ సదస్సుల్లో 1013 అర్జీలు రాగా 600కు పైగా భూసర్వే సమస్యలే ఉన్నాయి. ఒకే సర్వే నెంబరు నలుగురు రైతులు ఉన్న వారికి ఒక ఎల్పీఎం నెంబర్ మాత్రమే ఇవ్వడం, రైతుల విస్తీర్ణంలో రీసర్వే తర్వాత వ్యత్యాసాలు రావడం, ఫొటోలు మారిపోవడం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన తర్వాత కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న రీసర్వేలో తప్పిదాలకు తావు లేకుండా సమగ్రంగా సర్వే చేస్తున్నారు. ప్రస్తుతం ఎస్.సోమవరం గ్రామంలో సమగ్ర సర్వే జరుగుతోంది.

అధికారుల పర్యవేక్షణ

గత ప్రభుత్వంలో రీసర్వేలో జరిగిన తప్పిదాలు తిరిగి జరగకుండా చూసేందుకు ప్రస్తుత ప్రభుత్వంలో అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సంబేపల్లె, కలకడ మండలాల్లో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. సుండుపల్లె మండలంలో రాజంపేట సబ్ కలెక్టర్ నిధియాదేవి ఇటీవల పరిశీలించారు. సర్వే సిబ్బందికి ప్రస్తుతం కావాల్సిన గడువు ఇవ్వడంతో శాశ్వత భూసమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఎకరం తిరిగి రీసర్వే పక్కాగా చేపట్టాలని అధికారులు చెబుతున్నారు.

భూవివాదాలు పరిష్కారం అవుతాయి

భూ సమగ్ర సర్వేతో దశాబ్దాల కాలం నుంచి ఉన్న భూవివాదాలు పరిష్కారం అవుతాయని మండల సర్వేయర్ హరికృష్ణ తెలిపారు. గత ప్రభుత్వంలో రీసర్వేలో తక్కువ సమయంలో ఒత్తిడి పెరిగి తప్పిదాలు జరిగిన మాట వాస్తవమే. ప్రస్తుతం తగినంత గడువు ఇవ్వడంతో భూముల వివాదాలు లేకుండా పరిష్కార మార్గం చూపేందుకు ఆస్కారం ఉంది. కార్యాలయం చుట్టూ రైతులు తిరగకుండా రీసర్వేలో తప్పులను సవరించుకోవడానికి ఇది చక్కటి అవకాశం.

- హరికృష్ణ, మండల సర్వేయర్, సంబేపల్లె

ఒకే ఎల్‌పీఎం నెంబర్ ఇవ్వడంతో సమస్యగా మారింది



ఒక సర్వే నెంబర్‌లో నలుగురు రైతులం ఉన్నాం. రీసర్వేలో ఒకే ఎల్‌పీఎం నెంబరు నలుగురికి ఇవ్వడంతో సమస్యగా మారింది. ప్రస్తుతం వన్‌బీ రావడం లేదు. ఒక్కో రైతుకు ఒక్కొక్క ఎల్పీఎం నెంబర్ ఇచ్చి ఉంటే ఈ సమస్య ఉండేది కాదు. రీసర్వే గ్రామాల్లో మ్యుటేషన్ ఫైల్ నిలిపివేశారు. దీంతో రైతులకు సమస్యగా మారింది. గ్రామసభల్లో అర్జీలు ఇచ్చాం. త్వరగా సమస్య పరిష్కరించాలి.

- వెంకటేశ్వర్లు, రైతు, నారాయణరెడ్డిగారిపల్లె, సంబేపల్లె

70 సంవత్సరాల తర్వాత

నూకాలమ్మ జాతర



జాతరకు సిద్ధమైన నూకాలమ్మ ఆలయం

● రేపటి నుంచి 5 రోజుల పాటు...



నూకాలమ్మ తల్లి

పుల్లంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామాపురం గ్రామంలో 70 సంవత్సరాల తర్వాత నూకాలమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాంత వాసులకు కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా భక్తుల కొంగు బంగారంగా నూకాలమ్మ తల్లి విరాజిల్లుతోంది. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు 5 రోజుల పాటు జాతరను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి మరమ్మతులు చేసి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. గ్రామంలో 70 ఏళ్ల తర్వాత జాతర నిర్వహిస్తుండడంతో గ్రామంలో పెద్దఎత్తున సందడి నెలకొంది. ఆర్థిక స్థోమత బాగా లేకపోవడంతో ఇన్నేళ్లు జాతర జరపలేదని, ప్రస్తుతం గ్రామస్థులందరం చందాలు వేసుకుని రూ.13 లక్షలు పోగుచేసి అమ్మవారి, పోతులరాజు పంచలోహ విగ్రహాలు తయారు చేయించి ఈ ఏడాది వైభవంగా జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

టీడీపీ వెంటే

బలిజ సామాజిక వర్గం

● టీడీపీ బలిజ నేతల స్పష్టీకరణ

రాజంపేట టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వెంటే ఉంటామని, టీడీపీ గెలుపు కోసం, పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తామని బలిజ నాయకులు స్పష్టం చేశారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీలో బలిజలకు సముచిత స్థానం లభిస్తుందని, బలిజ సామాజికవర్గానికి చెందిన సామాన్య కార్యకర్తలకు కూడా మంచి పదవులు ఇస్తూ గౌరవప్రదమైన హోదాలో ఉంచుతుందని తెలిపారు. అందుకే టీడీపీకి అండగా ఉంటామని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో బలిజ నేతలు గీతాంజలి విద్యాసంస్థల అధినేత రమణ, గుగ్గిళ్ల చంద్రమౌళి, గంపా శివ, చెంగల్‌రాయుడు, కొండా శ్రీను, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసయ్య, ఎంఎల్ నరసయ్య, చెంగల్‌రావు, శ్రీనివాసులు, ప్రభాకర్, నరసింహా, మోహన్, చంద్రమోహన్, వెంకటస్వామి, హరినాథ్, కెఎస్ నరసింహులు, రంగయ్య, చంద్రశేఖర్, పశుపతి, గిరిధర్, నరసింహారావు, సుధాకర్, వరదయ్య, హజరయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న టీడీపీ బలిజ నాయకులు

విద్యుత్ బిల్లుతో షాక్

● ఫ్లోర్‌మిల్లుకు రూ.97,500 బిల్లు



రూ.97,550 వచ్చిన విద్యుత్ బిల్లు



బాధితుడు వాసు

నందలూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలో గల శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఫ్లోర్‌మిల్లుకు సంబంధించి విద్యుత్ బిల్లు 97,500 రూపాయలు రావడంతో యజమాని నారపుశెట్టి వాసు లబోదిబోమంటున్నారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఈ రైస్‌మిల్లును నాలుగేళ్లుగా నడుపుతున్నామని, ప్రతినెలా విద్యుత్ బిల్లు 9 వేల నుంచి 10 వేల వరకు వస్తుండేదన్నారు. అయితే గత నెల విద్యుత్ అధికారులు స్మార్ట్ మీటరు బిగించారని దీంతో మే నెల కరెంటు బిల్లు 10 వేలకు బదులు 97,500 రూపాయలు వచ్చిందని, ఈ విషయమై విద్యుత్ అధికారులను కలిసినా స్పందించడం లేదని వాపోయాడు. ఉపాధి కోసం రైస్ మిల్లు పెట్టుకున్నానని ఇంత పెద్ద ఎత్తున కరెంట్ బిల్లు వస్తే ఎలా కట్టాలని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు మొరపెట్టుకుంటున్నాడు.

అమ్మో.. జాక్‌పాట్! 6

ఎట్టకేలకు ఫలించిన 'ఢిల్లీ రైలు' కల!

● రేపటి నుంచి రాజంపేటలో సంపర్క్‌క్రాంతి రైలు స్టాపింగ్

అన్నమయ్య ప్రాజెక్టు అధ్యయనానికి

సాంకేతిక నిపుణుల కమిటీ ఏర్పాటు

కలికిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరద విధ్వంసానికి కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ కోసం ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రాథమికంగా ఈ ప్రాజెక్టు పునరుద్ధరణపై అధ్యయనం చేయడానికి ఆరుగురు ఉన్నత స్థాయి నిపుణులతో కూడిన సాంకేతిక బృందాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉన్నత స్థాయి నిపుణుల కమిటీలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ డిజైన్ ఎక్స్‌పర్ట్ చీఫ్ ఇంజినీరు రమేష్‌కుమార్, హైదరాబాదుకు చెందిన హైడ్రో మెకానికల్ ఎక్స్‌పర్ట్, రిటైర్డు చీఫ్ ఇంజినీరు కె.సత్యనారాయణ, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డు డైరెక్టర్ జనరల్ (జియాలజిస్టు) ఎం.రాజు, జలవనరుల శాఖ సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజినీరు (డిజైన్ అప్రూవింగ్ అథారిటీ), విజయవాడ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్ హైడ్రాలజీ చీఫ్ ఇంజనీర్లు కమిటీ సభ్యులుగా, కడప జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు) కన్వీనరుగా నియమిస్తూ ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో 2022లో రివర్ గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా నదులతో పాటు ఇతర ప్రాజెక్టులపై సలహాలివ్వడం కోసం నియమించిన కమిటీకి నిర్దేశించిన నిబంధనలన్నీ ప్రస్తుత సాంకేతిక నిపుణుల కమిటీకి వర్తించనున్నట్లు పేర్కొంటూ జల వనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం కమిటీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

అవార్డులతో లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

● చంద్రబాబు నుంచి నేనూ ప్రతిభ అవార్డు అందుకున్నాను..
● జిల్లాలో 221 మందికి అవార్డులు ప్రదానం
● కలెక్టర్ చామకూరి శ్రీధర్



విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, తదితరులు

రాయచోటి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు షైనింగ్ స్టార్స్ అవార్డులు దోహదం చేస్తాయని, దీనిని స్ఫూర్తిగా తీసుకుని లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని సుధా ఈవెంట్స్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 10వ తరగతి, 12వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవార్డు పొందిన విద్యార్థులు, తల్లిదండ్రుల మాటల్లోని సంతోషం నా కళ్లకు కట్టినట్లుగా ఉందన్నారు. 2002లో తాను ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనపర్చినందుకు హైదరాబాదులో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆరోజు ప్రతిభా అవార్డు అందుకున్నానని తెలిపారు. ప్రతిభ ఉన్నప్పుడు మనం ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవాలని, అప్పుడే కచ్చితంగా చేరుకుంటామన్నారు. మా అమ్మ, నాన్న చదువుకోలేదని, కానీ నన్ను చదివించారన్నారు. ప్రతిభా అవార్డుతో పాటు స్కాలర్‌షిప్ కింద రూ.12,500 పొందానన్నారు. ఆనాడు ఎంసెట్ ద్వారా ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో సీటు వస్తే అక్కడ కట్టాల్సిన ఫీజు 5 వేలు, హాస్టల్ ఫీజు మరొక రూ.7200 అన్నారు. ఆ సంవత్సరం మొత్తం ఫీజులు నా స్కాలర్‌షిప్‌తో సరిపోయి నేను చదువుకోవడానికి ఎంతో ఉపయోగపడిందన్నారు. చదువు పూర్తయి, ఐఏఎస్ ఆఫీసర్ అయ్యి ఆనాడు ఏ వ్యక్తి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకున్నానో అదే వ్యక్తి ప్రభుత్వంలో నేడు ఈ జిల్లా కలెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో ఈ అవార్డులు ఇస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు, తల్లిదండ్రులకు అర్థమయ్యేలా రామాయణంలో హనుమంతుని కథను, అలాగే మొసలి, జింక, కోతి తదితర రకాలైన పోటీలో వాటి సహజ గుణాన్ని బట్టి ఒక్కొక్క చోట విజయం సాధించడం గురించి ఒక చిన్న కథను చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి మాట్లాడారు. అనంతరం జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన 185 మంది 10వ తరగతి విద్యార్థులతో పాటు అత్యుత్తమ మార్కులతో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన 36 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 వేలు నగదు, మెడల్, ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్, ముఖ్య అతిధుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి రవి, డీఈవో సుబ్రమణ్యం, మదనపల్లె డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి, ఐఈడీ కో-ఆర్డినేటర్ జనార్దన్, సీఎంవో కరుణాకర్, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, ఎంఈవో ఆంజనేయులునాయుడు, టీఎస్‌యూఎస్ కన్వీనర్ వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షుడు రామక్రిష్ణ, 30 మండలాల ఎంఈవోలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల లెక్చరర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



యోగాసనంలో మహిజ

రాజంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : శారీరక మానసిక ఆరోగ్యం, భావోద్వేగాల సమతుల్యతలు యోగాతోనే సాధ్యమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం ఉదయం బోయనపల్లెలోని అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆధ్వర్యంలో 617 మందితో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకుంటే శారీరకంగా, మానసికంగా ఆధ్యాత్మికంగా ఉన్నతమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. ప్రస్తుతం ఇక్కడ వేసిన ఆసనాలను నెలరోజుల పాటు అభ్యాసం చేస్తూ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా రాజంపేట హైదర్‌నగర్‌కు చెందిన మహిజ వేసిన యోగాసనాలు అందరినీ అబ్బురపరచాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అన్నమాచార్య కీర్తనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, సబ్ కలెక్టర్ నిధియాదేవి, ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే, జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం, డీఆర్డీఏ పీడీ సత్యనారాయణ, డ్వామా పీడీ వెంకటరత్నం, పీఆర్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ ఏఈలు దయాకర్‌రెడ్డి, సహదేవరెడ్డి, డీఎంహెచ్‌వో ఉషశ్రీ, పశు సంవర్థకశాఖ అధికారి గురుప్రకాశ్, తహసీల్దార్, ఎంపీడీవో, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



యోగాసనంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

అమ్మో.. జాక్‌పాట్!

ప్రకృతి వైపరీత్యాలు, పెట్టుబడి కోసం చేసిన అప్పులకు పెరిగిపోతున్న వడ్డీలు, మార్కెట్‌లో ఒడిదుడుకులతో ఏటేటా తీవ్రంగా నష్టపోతున్న రైతులను జాక్‌పాట్ భూతం మరింతగా కుంగదీస్తోంది. ఎండా, వానా, పగలు, రేయనక కష్టించి పండించి మార్కెట్‌కు తరలించిన టమోటాల్లో 10 శాతం పైగా జాక్‌పాట్ భూతం అప్పనంగా మింగేస్తోంది. దీంతో మంచి ధర పలికినపుడు సైతం సంతోషమన్నది రైతు గడపదాకా చేరకుండా పోతోంది.



- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- మారని వ్యాపారుల తీరు
- కొత్త పాలకవర్గం సమస్య పరిష్కరించేనా?

గుర్రంకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): టమోటా మార్కెట్‌లో జాక్‌పాట్ భూతం రైతులను పట్టి పీడిస్తోంది. మార్కెట్‌కు టమోటాలు తెచ్చిన ప్రతిసారీ రైతు వేలాది రూపాయల మేరకు నష్టాలను మూటగట్టుకుంటున్నాడు. మంచి ధర పలికే సమయంలో ప్రతి రైతూ తెలిసి తెలిసీ లక్షలాది రూపాయలను జాక్‌పాట్ రూపంలో కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విధానం రద్దు చేయాలంటూ దశాబ్దకాలంగా రైతులు మార్కెట్ యార్డు వద్ద ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానం, అధిక కమీషన్‌లను రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నా.. ఆచరణలో అవి నీటిమూటలుగానే మిగిలాయి. దీంతో వ్యాపారులు తాము చేసిందే చట్టమంటూ దోపిడీ కొనసాగిస్తున్నారు.

జాక్‌పాట్ అంటే...

ఓ రైతు 25 కిలోల బరువు గల వంద క్రేట్‌ల టమోటాలను మార్కెట్‌కు తీసుకొస్తే.. అందులో పది క్రేట్లకు ఒక క్రేట్‌ను జాక్‌పాట్‌గా తీసుకుంటారు. దీంతో వంద క్రేట్లకు పది క్రేట్లు జాక్‌పాట్ కింద రైతు నష్టపోతాడు. క్రేట్లకు నిండుగా టమోటాలు లేవంటూ మరికొన్ని క్రేట్ల టమోటాలను మిగిలిన క్రేట్లపై పోస్తారు. ఇలా రైతు తెచ్చిన వంద క్రేట్లు కాస్తా వ్యాపారులు వేలం నిర్వహించే లోపు 80 క్రేట్లకు వచ్చేస్తాయి.

కొత్తపాలకవర్గం వైపు...రైతుల చూపు

వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి వారం రోజుల క్రితం కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసింది. దీంతో ఏడాదిగా కాలంగా ఖాళీగా ఉన్న చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు భర్తీ అయ్యాయి. మార్కెట్ కమిటీకి వాల్మీకిపురం కంటే గుర్రంకొండ మార్కెట్ యార్డు ద్వారానే ఏడాదికి కోటిపైగా ఆదాయముంది. ఇంతటి ఆదాయమున్న మార్కెట్ యార్డులో రైతులు జాక్‌పాట్ విధానంతో అష్టకష్టాలు పడుతున్నారు. ఈ క్రమంలో కొత్త పాలకవర్గమైనా జాక్‌పాట్ విధానంపై కఠినంగా వ్యవహరించి రైతులకు మేలు చేస్తారని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

జాక్‌పాట్‌ను రద్దు చేయాలి



గుర్రంకొండ మార్కెట్ యార్డులో రైతుల నడ్డి విరుస్తున్న జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలి. ఈ విధానం కారణంగా టమోటాకు ధరలు లేని సమయంలో పెట్టుబడులు కూడా రావడం లేదు. వ్యాపారులు అధిక కమీషన్ వసూలు చేస్తున్నారు. జాక్‌పాట్ విధానం రద్దు చేయాలని పలు మార్లు మార్కెట్ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతస్థాయి అధికారులు కల్పించుకుని రైతుల పాలిట భూతంలా మారిన జాక్‌పాట్‌ను తరిమివేయాలి.

- పి.అమరనాథ్, రైతు గుర్రంకొండ

వ్యాపారులతో మాట్లాడి పరిష్కరిస్తాం



గుర్రంకొండ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంపై రైతుల నుంచి అధికంగా ఫిర్యాదులు అందాయి. మార్కెట్ యార్డులో వ్యాపారులు, అధికారులతో సమావేశం నిర్వహించి జాక్‌పాట్ విధానంపై చర్చిస్తాం. రైతులకు నష్టం కలిగించే జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయించి రైతులను ఆదుకుంటాం. రైతుల సమస్యలను ఒకదాని తరువాత ఒకటిగా పరిష్కరిస్తాం.

-షేక్ నౌషాద్‌అలీ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్

అంతర్ రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ విజేత చెన్నై

పీలేరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు విజేతగా చెన్నై ఎస్‌ఆర్‌ఎం టీం నిలిచింది. పీలేరు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిశాయి. ఇందులో మూడు రాష్ట్రాలకు చెందిన 18 టీంలు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్ పోటీలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ చెన్నై టీం విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానం కర్ణాటక టీం, తృతీయ స్థానం చెన్నైకి చెందిన ఎస్టీ జోసెఫ్ టీం, నాలుగో స్థానంలో గుంటూరుకు చెందిన సౌత్ సెంట్రల్ రైల్వే జట్టు నిలిచాయి. ఈ కార్యక్రమంలో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, భాస్కర్ రెడ్డి, ఏపీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ, పలువురు పీడీలు, పీఈటీలు, పీలేరు బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.



అంతర్‌రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ కప్పుతో చెన్నై ఎస్‌ఆర్‌ఎం టీం

ఎట్టకేలకు ఫలించిన 'ఢిల్లీ రైలు' కల!

- 11 నుంచి రాజంపేటలో సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్

రాజంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీ నగరానికి నేరుగా వెళ్లే రైలుకు రాజంపేటలో స్టాపింగ్ కోసం రెండు దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తిరుపతి నుంచి ఢిల్లీకి వెళ్లే రైలు 12707 సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 11 నుంచి రాజంపేటలో స్టాపింగ్ ఇస్తూ దక్షిణమధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ ఒక ప్రకటన జారీ చేశారు. ఈ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ కోసం రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ద్వారా సాయిలోకేశ్ కేంద్ర మంత్రిని కలిసి విన్నవించారు. ఈ మేరకు రైల్ నంబరు 12707 తిరుపతి-హెచ్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్, 12708 హజరత్ నిజాముద్దీన్ - తిరుపతి సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో ఆగనున్నాయి. ప్రతి సోమ,బుధ , శుక్ర వారాల్లో 12707 ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో ఉదయం 6.43 గంటలకు ఆగి 6.45 కు బయలుదేరనుంది. ఆది,బుధ, శుక్రవారాల్లో 12708 ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో 18.38 గంటలకు ఆగి 18.40 గంటలకు బయలుదేరనుంది. ఈనెల 11న రాజంపేటలో ఆగుతున్న సందర్భంగా రాష్ట్ర రోడ్డు రవాణా యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించనున్నారు. 12708 హజరత్ నిజాముద్దీన్ తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఈనెల 13 నుంచి రాజంపేటలో ఆగనుంది. దీనిని రైల్వే అధికారులు అధికారికంగా ప్రారంభించనున్నారు. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట ప్రధాన రైల్వే స్టేషన్, పార్లమెంటు నియోజకవర్గ కేంద్రంగా, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న రాజంపేటలో ఈ రైలు ఆగడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. రాజంపేట రైల్వేస్టేషన్ మార్గం ద్వారా ప్రతిరోజు 33 రైళ్లు ప్రయాణిస్తూ ఉంటాయి. అందులో కొన్ని రైళ్లు తప్ప మిగిలిన ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ రాజంపేట రైల్వేస్టేషన్‌లో ఆగవు. కరోనా తరువాత గతంలో ఆగే అనేక రైళ్లను కూడా రద్దు చేశారు. ఈ విషయాన్ని గమనించి రాజంపేట రైల్వేస్టేషన్ ప్రాముఖ్యతను వివరిస్తూ కేంద్ర మంత్రులతో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ పలుసార్లు వినతిపత్రాలు సమర్పించగా ఇటీవల పలు రైళ్లు రాజంపేటలో ఆగుతున్నాయి. ఈ నెల 11న సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో స్టాపింగ్ సందర్భంగా రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



కూటమి ప్రభుత్వం ఇచ్చే కానుక : సాయి లోకేశ్

దేశరాజధాని ఢిల్లీకి వెళ్లాలన్నా, అక్కడి నుంచి రావాలన్నా ఈ మార్గంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి రావడానికి ఈ రైలు ఎంతో ప్రయోజకనరమైనది. నా విన్నపాన్ని మన్నించి కేంద్ర బీజేపీ ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం పాలనలో రాజంపేటలో ఈ రైలు స్టాపింగ్‌కు ఉత్తర్వులు జారీ చేయడం చెప్పలేని ఆనందంగా ఉంది. 11వ తేదీ నుంచి రాజంపేటలో సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ ఆగడానికి అధికారికంగా రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉంది.

'తోతాపురి మామిడి'కి మద్దతు ధర

- విధి విధానాలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

రైల్వేకోడూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడి పండ్లకు మద్దతు ధర ప్రకటించింది. ప్రాసెసింగ్ కంపెనీలు కిలోకు రూ.8, రాష్ట్ర ప్రభుత్వం రూ.4 చొప్పున రైతులకు అందజేయనుంది. ఇందుకు సంబంధించిరాష్ట్ర ప్రభుత్వం రైతులకు పలు సూచనలు చేసింది. వివరాలిలా..

మామిడి రైతులు తమ 1బి, ఆధార్ కార్డు, ఆధార్ లింక్డ్ బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను ఫ్యాక్టరీ, ఎఫ్‌పీఓ లేదా మార్కెట్ యార్డుకు తీసుకెళ్లాలి. పక్వానికి వచ్చిన కాయలను దశలవారీగా కోయాలి. ఒకేసారి కోయడం వల్ల ఫ్యాక్టరీల వద్ద రద్దీ ఏర్పడి, యాజమాన్యానికి ఇబ్బంది కలుగుతుంది. ఫ్యాక్టరీకి నేరుగా కాయలు తీసుకెళ్లే రైతులు పైన పేర్కొన డాక్యుమెంట్లను తప్పనిసరిగా తీసుకెళ్లాలి. అక్కడ విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు రైతుల వివరాలను నమోదు చేస్తారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా రైతు, పంట వివరాలను నమోదు చేస్తుంది. ప్రభుత్వ మద్దతు ధర నేరుగా రైతు ఖాతాలో జమ అవుతుంది. ఫ్యాక్టరీ చెల్లించే మొత్తం కూడా రైతు ఖాతాలోనే జమ అవుతుంది. మార్కెట్ యార్డు లేదా ఎఫ్‌పీఓకు కాయలు తీసుకెళ్లే రైతులు ఆయా డాక్యుమెంట్లను తీసుకెళ్లి, అక్కడ విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి వద్ద నమోదు చేయించుకుని, మార్కెట్ యార్డు ఎఫ్‌పీఓకు కాయలను అమ్మాలి. ఉదాహరణకు, ఇద్దరు రైతులు 5 టన్నుల చొప్పున కాయలు అమ్మితే, మార్కెట్ యార్డు వారు నాణ్యత తనిఖీ చేసి, రైతులకు నేరుగా లేదా డిజిటల్ విధానంలో నగదు చెల్లిస్తారు. మార్కెట్ యార్డు వారు ట్రాకులో లోడ్ చేసిన తర్వాత ఏ రైతుకు సంబంధించిన సరుకు ఏ ఫ్యాక్టరీకి వెళ్తుందనే విషయాన్ని ప్రభుత్వ ఉద్యోగి నమోదు చేస్తారు. ఈ వివరాలను ఫ్యాక్టరీ వద్ద ఉన్న ప్రభుత్వ ఉద్యోగికి అందజేస్తారు. ప్రభుత్వం రూ.4 మద్దతు ధరను రైతు ఖాతాలో నేరుగా జమ చేస్తుంది. రైతులు ఈ నెల 9వ తేదీ నుంచి తమకు అనుకూలమైన ఫ్యాక్టరీ లేదా మార్కెట్ యార్డు యాజమాన్యంతో సంప్రదించి కాయలను కోయడం ద్వారా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవచ్చుని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు ఒక ప్రకటనను విడుదల చేశారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి : ఎస్పీ

రాయచోటిటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోపు విచారణ చేసి సత్వరం పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మం ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రానికి రాలేని వారు తమకు సమీపంలోని పోలీసు స్టేషన్లు, సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో అర్జీలు సర్పించవచ్చునన్నారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలు తెలుసుకుని సత్వరం న్యాయం చేస్తామన్నారు.



బాధితుల వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

ఫిర్యాదుదారుల వద్దకు ఎస్పీ..

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ సమస్యలు వినిపించేందుకుగుర్రంకొండ మండలం సూరప్పగారిపల్లె నుంచి ఇడగొట్టి పుష్పలత జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేశారు. ఆమె నడవలేని స్థితిలో ఉన్నట్లు తెలుసుకున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆమె వద్దకే వెళ్లి సమస్యను విన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ చట్ట పరిధిలో ఆమె సమస్యను పరిష్కరించాలని గుర్రంకొండ ఎస్ఐని ఆదేశించారు. చిన్నమండెం మండలం పఠాన్ అమీరుల్లాఖాన్ అనే వృద్ధుడి వద్కుఉ వెళ్లి సమస్యను విన్నారు. ఆయన సమస్యను పరిష్కరించాలని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్‌ను ఆదేశించారు.

జలవనరుల శాఖ ఇంజనీర్లపై విచారణ

కలికిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం జలవనరుల శాఖ కడప సర్కిల్ పరిధిలో పనిచేసిన ఐదుగురు ఇంజనీర్లపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఇందుకు సంబంధించి విచారణాధికారిని నియమిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. కడప జిల్లా కలసపాడు మండలం బ్రాహ్మణపల్లెలో రాచెరువు పటిష్టీకరణతోపాటు, నీటి పారుదల కాలువల అభివృద్ధి పనులకు ప్రపంచ బ్యాంకు నిధులు మంజూరు చేసింది. ఈ పనులను పూర్తి చేసే క్రమంలో సంబంధిత ఇంజినీర్లు తీవ్రమైన అక్రమాలకు పాల్పడ్డట్టు విజిలెన్స్ గుర్తించింది. ఈ అవకతవకలకు సంబంధించిన వివరాలను సాక్ష్యాధారాలతో 2021 అక్టోబరు 18న ప్రభుత్వానికి అందజేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది. ఇది గడిచిన అనంతరం ప్రభుత్వం తాపీగా సరిగ్గా ఏడాది తరువాత 2022 అక్టోబరు 18 బాధ్యులైన ఐదుగురు ఇంజినీర్లకు నామమాత్రంగా నోటీసులు అందజేసి పది రోజుల గడువుతో సంజాయిషీలు కోరింది. అంతటితో ఇది మూలన పడింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఐదుగురు ఇంజనీర్లు సమర్పించిన సంజాయిషీలను పరిశీలించి తదుపరి విచారణకు ఆదేశాలు జారీ చేసింది. అప్పట్లో ఈ పనులను పర్యవేక్షించిన జలవనరుల శాఖ ఈఈ ఎం.కొండారెడ్డి(ప్రస్తుతం రిటైరయ్యారు), మరో ఈఈ ఇ.మల్లికార్జున, డీఈఈలు ఎం.వి. రమణారెడ్డి, టి.మల్లికార్జున, ఏఈఈ ఎస్.ఫణీంద్ర సింగ్‌లు విచారణను ఎదుర్కోవలసి వుంది. విచారణాధికారిగా కడపలోని రాయలసీమ రీజియన్ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీరు ఎం.కిరణ్ కుమార్‌ను విచారణాధికారిగా నియమించింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయి ప్రసాద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

ప్రజల సమస్యలు తక్షణం పరిష్కరించాలి: డీఆర్‌వో

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డీఆర్‌వో మధుసూదన్‌రావు సూచించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేదిక ద్వారా అందిన ప్రజల అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు.ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందన్నారు. ప్రతి సమస్యపై ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ఫిర్యాదులను వంద శాతం పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి సమస్యను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. కొంత మంది అర్జీదారులు పదే పదే వస్తున్నారని అలా కాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలదేనన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్‌డీసీ రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు

ఆటోనగర్ ప్రారంభానికి చర్యలు

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని ఆటో కార్మికులకు కలగా మిగిలిపోయిన ఆటోనగర్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీలోని 33 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఆటోనగర్ స్థలాన్ని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తితో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆటోనగర్‌కు కేటాయించిన స్థలంలో కొంత స్థలం ముగ్గురు రైతులు కోర్టులో కేసు వేశారని, ఈ ముగ్గురు రైతులకు నచ్చజెప్పి తగిన నష్టపరిహారం ఇచ్చేలా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ విషయమై ఏపీఐఐసీ అధికారులతో కూడా చర్చించామన్నారు. త్వరలో ఆటోనగర్ ప్రారంభానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, సర్వేయర్ రెడ్డిశేఖర్‌బాబు, టీడీపీ నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వలసపల్లె పంచాయతీలోని ఆటోనగర్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

అన్నమయ్య జిల్లాలో ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

రాయచోటిటౌన్, జూన్9(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లెలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల, మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సోమవారం 6 పరీక్షా కేంద్రాల్లో 1092 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 951 మంది హాజరుకాగా 141 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలియజేశారు.



భాస్కర్ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

విత్తనోత్పత్తితో అధిక ఆదాయం

- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మణిమురుగన్

పుల్లంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విత్తనోత్పత్తితో రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని భారత నూనెగింజల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మణిమురుగన్ తెలిపారు. అన్నమయ్య జిల్లా ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని అనంతసముద్రం, అప్పయ్యరాజుపేట గ్రామాల్లో కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతుల ప్రత్యక్ష సంభాషణలను వారికి ఖరీఫ్ పంట కాలం ముందు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. 700 జిల్లాల్లో 2 వేల మంది కంటే ఎక్కువ భాగస్వామ్యంతో నూతన సాంకేతికత, ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. నువ్వులు, పొద్దుతిరుగుడు విత్తనాలు మేలైన రకాల యాజమాన్య పద్ధతులు, సాగులో సాంకేతికత, డ్రోన్లపై వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ మాధవి మాట్లాడుతూ ప్రధాన పంటల్లో జీవన ఎరువులు, జీవ నియంత్రకాల వాడకంపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మానస మాట్లాడుతూ మామిడి, అరటి, బొప్పాయ, చీనీ, నిమ్మ తోటల్లో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పుల్లంపేట వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు సంఘాలుగా ఏర్పడి లాభసాటి వ్యవసాయం వైపు సాగాలని తెలియజేస్తూ ప్రభుత్వ పథకాలను వివరించారు. నేల సమతుల్యతను కాపాడే విధంగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సుచిత్ర మాట్లాడుతూ అంతర పంటల ప్రాముఖ్యత, పంట మార్పిడి, అధిక దిగుబడిని ఇచ్చే నూతన వంగడాల ప్రాముఖ్యతపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బీటీఎం సుబ్రమణ్యం, గ్రామీణ వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతు ఉత్పత్తిదారులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మణి మురుగన్

ఇద్దరు దొంగల అరెస్ట్

- 75 గ్రాముల బంగారు, 226 గ్రాముల వెండి నగలు స్వాధీనం
- పట్టుబడినవారు 9 కేసుల్లో నిందితులు

పీలేరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద రూ. 8 లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ హెగ్డే తెలిపారు. పీలేరు పట్టణ శివారు ప్రాంతంలోని కోళ్లఫాం వద్ద సోమ వారం మదనపల్లెలోని చీకటిగుట్ట ప్రాంతానికి చెందిన కావడి సోమ శేఖర్(29), పీలేరులోని ఎస్టీ కాలనీకి చెందిన జరుపుల మణికంఠ (27)ను అదుపులోకి తీసుకుని 75 గ్రాముల బంగారు, 226 గ్రాముల వెండి నగలు, హీరోహోండా స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెపారు. నిందితులపై పీలేరులో 3 కేసులు, కలికిరిలో రెండు, మదనపల్లెలో రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు పోలీస్ విచారణలో వెలుగుచూసింది. కావలి సోమశేఖర్‌పై 15 కేసులు నమోదైఉండగా, రెండవ ముద్దాయి మణికంఠ పీలేరు మండ లం యర్రగుంటపల్లె పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో ఉంటూ భార్య హత్య కేసులో జైలుకు వెళ్లాడు. జైలులో ఉన్నపుడు ఇరువురి మధ్య పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలయ్యాక ఇరువురూ ద్విచక్ర వాహనంపై తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడేవారని ఏఎస్పీ తెలిపారు.



పట్టుబడిన దొంగలు, స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న ఏఎస్పీ మనోజ్ హెగ్డే


సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

విడిగా ఉండే ఇళ్ల వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏఎస్పీ సూచించారు. ఇంటి వద్దకు ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చినపుడు కిటికీ ద్వారా పరిశీలించి తలుపులు తీయాలని సూచించారు. ద్విచక్రవాహనాలపై సంచరించే కొత్త వ్యక్తులపై నిఘా ఉంచి అనుమానాస్పదంగా అనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇళ్లకుతాళం వేసుకొని ఊర్లకు వెళ్లేటపుడు పోలీసులు, ఇరుగు పొరుగు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఖరీదైన బంగారు, నగదు తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు.

ఎస్పీ అభినందన

ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేయడంతో పాటు, చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంతో కీలకంగా వ్యవహరించిన పీలేరు సీఐ యుగంధర్, ఎస్ఐ లోకేశ్, సిబ్బంది శ్రీనివాసులు, రాధాకృష్ణ, ఉపేంద్ర, తిరుపాల్ నాయక్, జగదీశ్‌ను ఎస్పీ అభినందించారు. విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మల్లయ్య కొండ



నృత్యాలు చేస్తున్న గొరవయ్యలు

తంబళ్లపల్లె, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగుస్తుండడంతో స్థానిక మల్లయ్యకొండలో ఉన్న భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని సోమవారం పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.దీంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది.అర్చకుడు ఈశ్వరప్ప స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల పేరిట అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో మల్లయ్యదారులు పిల్లనగ్రోవి వాయిద్యాలతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బంది కలుగకుండా కొండపైన అన్ని సౌకర్యాలు కల్పించారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు, విద్యార్థులు

ముద్దనూరులో రైళ్ల నిలుపుదల ఎప్పుడో..!



ముద్దనూరు జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు రైల్వే స్టేషన్‌లో విజయ వాడకు వెళ్లే రైళ్లను తప్పనిసరిగా నిలపాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ముద్దనూరు రైల్వేస్టేషన్ ఉన్నప్పటికి చాలా వరకు రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం దీనిపై ఎందుకు స్పందించడం లేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

ముద్దనూరు ఒకప్పుడు సమితి కేంద్రంగా ఉండేది. కొండాపురం మండలం కూడా ముద్దనూరు సమితీలో ఉండేది. అంటే ముద్దనూరు అంత ప్రాధాన్యత కలిగి ఉండేది. మండల కేంద్రంలో వ్యవసాయశాఖ ఏడీ, ఉద్యానశాఖ, పశువైద్యశాల ఏడీ, అటవీశాఖ రేంజి, ఐసీడీఎస్ కార్యాలయాలు ఉన్నాయి. అంతేకాకుండా జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతాల నుంచి ప్రజలు చెన్నై, హైదరాబాదు, ముంబైకు రైలు ప్రయాణం చేయాలన్న ముద్దనూరు రైల్వే స్టేషన్‌కు వస్తారు. నిమ్మకాయల ఎగుమతి కూడా ఎక్కువగా ఇక్కడి నుంచే జరుగుతుంటుంది. కరోనా సమయంలో చాలా రైళ్లను నిలిపివేశారు. కానీ రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి కేంద్రంగా ఉంది. ప్రస్తుతపరిస్థితుల్లో ముద్దనూరు, పులివెందుల ప్రజలు అమరావతికి వెళ్లాలన్నా, విజయవాడ, గుంటూరులో చదువుకునే విద్యార్థులు ముద్దనూరులో రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ధర్మవరం నుంచి విశాఖపట్నంకు ఎర్రగుంట్ల మీదుగా రైలు నడుస్తుంది. ప్రస్తుతం మరో రైలు గుంతకల్లు నుంచి కడప మీదుగా విజయవాడకు పునరుద్ధరించారు. ఈ రెండింటికి ముద్దనూరు స్టేషన్‌లో స్టాపింగ్ లేదు. చాలా చోట్ల ప్రజాప్రతినిధులు, సంఘాలు పోరాడి స్టేషన్‌లలో స్టాపింగ్ చేయిచుకుంటున్నా ఎంతోప్రాధాన్యత ఉన్న ముద్దనూరులో అమరావతికి వెళ్లే రైళ్లకు స్టాపింగ్ లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రజల సౌకర్యార్థం రైళ్లను ముద్దనూరు స్టేషన్‌లో నిలపేటట్లు ప్రజాప్రతినిధులు, గుంతకల్ రైల్వే డివిజన్ అధికా రులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైళ్లు నిలపాలి

ముద్దనూరు స్టేషన్‌లో విజయవాడ వెళ్లే రైళ్లకు స్టాపింగ్ ఉంటే సౌకర్యంగా ఉంటుంది. బస్సుల్లో వెళ్లాలంటే చార్జీ ఎక్కువగా ఉంటుంది. సమయానికి రిజర్వేషన్ సీట్లు దొరకవు. దీంతో సెలవుల్లో ఇంటికి వచ్చి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నాం. రైళ్లకు ఇక్కడ స్టాపింగ్ ఉంటే రిజర్వేషన్ సౌకర్యం లేకున్నా, జనరల్‌లో ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది.

-ఉమామహేశ్వర్, విద్యార్థి, ముద్దనూరు

ఉత్సాహంగా సౌత్‌జోన్ మహిళా క్రికెట్

● ఐదు జిల్లాల క్రీడాకారిణిల హాజరు



పోటీలను ప్రారంభిస్తున్న ఎన్‌డీసీఏ ప్రతినిధులు

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని సీఏ క్రీడామైదానంలో సోమవారం అండర్-15 మహిళల ఏసీఏ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన క్రికెట్ క్రీడాకారిణిలు ఈ పోటీలకు హాజరయ్యారు. వారంపాటు పోటీలను నిర్వహించనున్నారు. తొలిరోజు పోటీల్లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 288 పరుగులు సాధించింది. ఈ జట్టులోని ఈ.గేయకీర్తి 120 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 118 పరుగులకే ఆలౌట్ కావడంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అనంతపు రం, కర్నూలు జట్లు తలపడగా, టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంత పురం జట్టు 16 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 78 పరుగులు మాత్రమే సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 21.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 81 పరుగులతో విజయం సాధించింది. తొలిరోజు ఈ పోటీలను ఎన్‌డీసీఏ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కే.శ్రీనివాసుల రెడ్డి, జనరల్ మేనేజర్ పీ. భాను ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యులు బీ.లీలామోహన్‌రెడ్డి, ఏసీఏ అంపైర్స్ పవన్‌కిషోర్, త్రినాథ్ పర్యవేక్షించారు.

రేషన్ స్మగ్లర్లపై చర్యలు తీసుకోండి

పౌరసరఫరాల శాఖ మంత్రికి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి లేఖ

పులివెందుల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో రేషన్ బియ్యం స్మగ్లర్లు బరితెగిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి లేఖ రాశారు. ఈ మేరకు ఆయన సోమవారం లేఖను మీడియాకు విడుదల చేశారు. రేషన్ స్మగ్లర్లకు లెక్కలేకుండా పోయిందన్నారు. గత కొన్ని రోజుల క్రితం వరకు విజిలెన్స్ అధికారులు కట్టడి చేసినప్పటికి మళ్లీ వారం రోజులుగా విచ్చలవిడిగా అక్రమ రవణాకు పాల్పడుతున్నారన్నారు. దీనికి కారణం తమరితో (మంత్రి) ఉన్న ఫొటోను వైసీపీకి చెందిన స్మగ్లర్లు కామేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌లు అందరికీ చూపిస్తూ మాకు మంత్రి అండదండలు ఉన్నాయని, మా జోలికి వస్తే అంతు చూస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఇవి నిజమైన ఫొటోలా లేక మార్ఫింగ్ ఫొటోలా అర్థం కాక అధికారులు హడలిపోతున్నారన్నారు. వారిపైన చర్యలు తీసుకోవాలని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు. వారు సర్క్యులేట్ చేస్తున్న ఫొటోలను లేఖతో పాటు జతచేస్తున్నామన్నారు. వీరిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

జాతీయ స్థాయి ఓపెన్ చెస్‌లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంటులో జిల్లా చెస్ క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించారు. వివిధ వయో విభాగాల్లో మొత్తం ఐదు బహుమతులు గెలుచుకున్నారు. అండర్-6 బాలుర విభాగంలో దీక్షిత్ 4వ స్థానం, అండర్-8 బాలికల విభాగంలో లాస్య ప్రియ 2వస్థానం, అండర్-8 బాలుర విభాగంలో ప్రణవ్ స్వరూప్ 5వ స్థానంలో నిలిచారు. అలాగే అండర్-10 బాలికల విభాగంలో ధనిత 4వ స్థానం, 50 ఏళ్లకు పైబడిన వయోవర్గంలో అనీస్ దర్బారి 1వ స్థానం పొందారు.

5వ రోజుకు.. కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

ఎర్రగుంట్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ఐసీయల్ కర్మాగారం వద్ద ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు చేస్తున్న ఆందోళన సోమవారానికి 5వ రోజుకు చేరింది. సోమవారం ఉదయం ప్లాంటులో పనిచేస్తున్న యాజమాన్య ఉద్యోగులు, ఇతర కాంట్రాక్టు కార్మికులు విధుల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే తాము ఆందోళన చేస్తున్న నేపథ్యంలో లోపలికి వెళ్లనివ్వమని కాంట్రాక్టు కార్మికులు అడ్డగించారు. దీంతో కొద్దిసేపు తోపులాట జరిగింది. తమ డిమాండ్లు నెరవేరేంత వరకు ఎవ్వరిని లోపలికి పంపేందుకు తాము అంగీకరించమని కాంట్రాక్టు కార్మికులు అడ్డంగా బైఠాయించారు. పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు.

ఈతకు వెళ్లి... సంపులో మునిగి చిన్నారులు మృతి



సంపులో పడి మృతి చెందిన రాముడు, లక్ష్మణుడు

చక్రాయపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తల్లితండ్రీ లేని ఇద్దరు అనాథ పిల్లలు ఈత కోసం వెళ్లి నీటి సంపులో మునిగి మృతి చెందారు. ఈ విషాదకర ఘటన ఆదివారం రాత్రి చక్రాయపేట మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..

చక్రాయపేట మండలం బాలతిమ్మయ్యగారి పల్లె సమీపంలోని ఓ మామిడి తోటలో ఉన్న సంపులో ఈత కోసం దిగిన ఇద్దరు చిన్నారులు నీట మునిగి మృతి చెందారు. ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన రాముడు (11), లక్ష్మణుడు (9) అన్నదమ్ములు. వీరి తండ్రి చనిపోవడం.. తల్లి దూరం కావడంతో మేనమామ కొండయ్య వద్ద ఆశ్రయం పొందుతున్నారు. కొండయ్య బతుకుదెరువు కోసం బాలతిమ్మయ్యగారిపల్లెలోని భాస్కర్ అనే రైతు మామిడితోటలో కాపాల ఉంటున్నాడు. పిల్లలకు సెలవులు కావడంతో ఆదివారం మేనమామ కొండయ్య ఉంటున్న తోట వద్దకు వచ్చారు. తోటలో పిల్లలు ఆడుకుంటూ ఉండడంతో ఆయన పనిమీద బయటకు వెళ్లారు. సాయంత్రం వచ్చి చూస్తే పిల్లలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. ఎక్కడ ఆచూకీ కనిపించలేదు. అప్పటికే పొద్దుపోయి రాత్రి కావడంతో చివరకు అనుమానం వచ్చి తోటలో ఉన్న సంపు వద్దకు వెళ్లి పరిశీలించాడు. అప్పటికే ఇద్దరు పిల్లలు సంపులో మునిగి మృతి చెందడం గమనించాడు. సంపు చుట్టూ ఉన్న తార్పాలిన్ పట్టకు పాచిపట్టి ఉండడతో బయటకు వచ్చే మార్గం లేక ఇద్దరు జారిపడిపోయి ఊపిరిడక మృతి చెంది ఉండవచ్చని సమాచారం. కాగా, మృతి చెందిన ఇద్దరు పిల్లలను సోమవారం తెల్లవారుజామున వారి సొంత గ్రామమైన ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు తరలించారు. అయితే ఈ సమాచారం చక్రాయపేట పోలీసులకు తెలియడంతో వారు పిల్లల మృతదేహాలను చక్రాయపేటకు తీసుకువచ్చి.. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కూలి డబ్బులు అడిగారని దాడి.. ముగ్గురికి గాయాలు

పులివెందుల,జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కూలి డబ్బులు అడిగినందుకు ముగ్గురు వ్యక్తులపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... పట్టణంలోని నగరిగుట్టకు చెందిన సాయిప్రసాద్, సాయి అనే ఇద్దరు కూలీలు విజయేంద్ర, సాయికుమార్‌లను ఆదివారం రాత్రికూలి డబ్బులు అడిగారు. ఈ విషయమై వీరి మధ్య మాటమాటపెరగడంతో సాయికుమార్, విజయేంద్ర అనే ఇరువురు సాయిప్రసాద్, సాయిలపై దాడి చేశారు. వీరితో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

కోదండరామాలయం వద్ద తప్పిన ప్రమాదం



అగ్నికి ఆహుతి అవుతున్న మొబైల్ మరుగుదొడ్లు

ఒంటిమిట్ట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయం వద్ద పెద్ద ప్రమాదం తప్పింది. టీటీడీ పరిపాలన కార్యాలయం సమీపంలో అగ్ని ప్రమాదం సంభవించింది. గత రెండు సంవత్సరాలుగా తుప్పు పట్టిన మొబైల్ మరుగుదొడ్లు ఉన్నాయి. వీటిని అధికారులు పాతసామన్లకు లెక్కకట్టి విక్రయించారు. సోమవారం సాయంత్రం వాటిని గ్యాసకట్టర్‌తో విడగొడుతుండగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే టీటీడీ విజిలెన్స్ అధికారులు మంటలను ఆర్పారు. దీంతో టీటీడీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ సమయంలో భక్తులు ఆ ప్రాంతంలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

● లేకపోతే మూల్యం చెల్లించక తప్పదు ● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధుల డిమాండ్



ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక దీక్షలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీలకు ప్రభుత్వం వెంటనే మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వం తగుమూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సోమవారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. దాదాపు 500 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా 25 మంది నాయకులు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దీక్ష కొనసాగించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నుంచి మల్లు రఘునాథరెడ్డి దీక్షలో పాల్గొన్న మాన్యువల్ కౌన్సెలింగ్‌తో ఉపాధ్యాయులకు కలిగే లాభాన్ని.. అలాగే వెబ్ కౌన్సెలింగ్ వల్ల ఉపాధ్యాయులు కలిగే నష్టాన్ని వివరించారు. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు మొండి వైఖరిని ప్రదర్శిస్తూ ఉపాధ్యాయులకు నష్టం కలిగే విధంగా వెబ్ కౌన్సెలింగ్ చేపట్టడాన్ని ఖండిస్తూ ప్రభుత్వం తనతీరు ఇప్పటికైన మార్చుకోవాలని లేనిపక్షంలో ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులకు గురవుతారన్నారు. కడప జిల్లా ఐక్యవేదిక నాయకులు మోపూరి వెంకటశివారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికి ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకుండా ముందుగానే తీసుకువచ్చి ఈరోజు కేటాయించిన స్లాట్‌ల రూపంలో విద్యాశాఖ అధికారుల మీద ఒత్తిడి తెచ్చి ఉపాధ్యాయులను భయ బ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. ఇలియాస్ బాష మాట్లాడుతూ ప్రభుత్వం మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టకపోతే మంగళవారం విజయవాడ విద్యా భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు గుజ్జల తిరుపాల్, సంగ మేశ్వర్ రెడ్డి, కొండారెడ్డి, అబ్దుల్లా, ఖాదర్ బాష, లెక్కల జమాల్‌రెడ్డి, బత్తిని నాగేశ్వర రావు,అమర్‌నాథరెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వేంపల్లె ఈఓ మళ్లీ సస్పెన్షన్

● చక్రాయపేట ఈఓపీఆర్డీ, పోరుమామిళ్ల ఈవో..

కడప, వేంపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఈఓగా పనిచేస్తున్న ఎన్‌వీ సుబ్బారెడ్డి రూ.1.86 కోట్ల పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని ఈ ఏడాది మార్చి 5వ తేదీ కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ రాజ్యలక్ష్మి సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఆయన సస్పెన్షన్‌లో కొనసాగు తుండగా తాజాగా పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఈఓ సుబ్బారెడ్డిని సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీపీఓ రాజ్యలక్ష్మి సోమవారం సుబ్బారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే వేంపల్లె ఈఓగా పనిచేసి ప్రస్తుతం చక్రాయపేట ఈఓపీఆర్‌అండ్‌ఆర్డీగా పనిచేస్తున్న భూమిరెడ్డి మల్లికార్జునరెడ్డిని సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఇచ్చిన ఆదేశాలతో డీపీఓ సస్పెన్షన్ వేటు వేశారు. సుమారు రూ.15లక్షల మేర పంచాయతీ నిధులను ఖాతాల్లో జమచేయకుండా నిబంధనలకు విరుద్ధంగా తనవద్ద ఉంచుకున్నారనే ఆరోపణలపై సస్పెండ్ చేశారు. అలాగే గతంలో వేంపల్లెలో ఈఓగా పనిచేస్తూ పోరుమామిళ్లకు వెళ్లిన రవిశంకర్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. ఈయన సుమారు రూ.48లక్షలు పంచాయతీ నిధులు ఖాతాలో జమచేయకుండా ఏడాదిన్నర పాటు తనవద్దే ఉంచుకున్నారనే ఆరోపణలపై డీపీఓ సస్పెండ్ చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆటో వితరణ



ఆటోను నడుపుతున్న ముక్కా, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడుగుంటపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ముక్కా ఫౌండేషన్ అధినేత, కుడా చైర్మన్ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఆటోను విరాళంగా ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌తో కలిసి కళాశాల ప్రిన్సిపాల్‌కు ఆటోను అందించారు. ఈ సందర్భంగా ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలకు వెళ్లాలంటే పట్టణం నుంచి సుమారు 4 కిలోమీటర్లు దూరం వెళ్లాలి. ఈ సమస్యను గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడంతో విద్యార్థుల ఇబ్బందిని గమనించి విద్యుత్ ఆటోను రూ.4 లక్షలతో కొనుగోలు చేసి కళాశాలకు అందజేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి చేసిన ఈ సహాయం అందరికీ స్ఫూర్తిదాయకం అని ప్రశంసించారు. అనంతరం ఆటోను ఎమ్మెల్యే స్వయంగా నడిపి కళాశాల యాజమాన్యంకు అందజేశారు. కార్యక్రమంలో టీడీ పీ యువ నాయకులు ముక్కా సాయి వికాష్‌రెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురికి రిమాండ్

చాపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.రాజుపాళెం గ్రామానికి చెందిన ఏడుగురి వ్యక్తులను సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టువారు వారికి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో నలసింగు మధు, పెద్దకుళాయప్ప, పవన్, జంగయ్య, కిశోర్, బాబు, క్రిష్ణయ్య ఉన్నట్లు చెప్పారు. గతనెల 27వ తేదీ ఆ గ్రామం వద్ద ఉన్న బంజరు భూమి విషయమై అదే గ్రామానికి చెందిన పల్లెం శ్రీనివాసులు, అతని కుటుంబ సభ్యులు కట్టెలు, మచ్చుకత్తులు, ఇనుపరాడ్లతో ఘర్షణ పడ్డారన్నారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

నేడు అత్తిరాలలో గిరి ప్రదక్షిణ

రాజంపేటటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిదిలోని అత్తిరాల మహాపుణ్యక్షేత్రంలో మంగళవారం సాయంత్రం ఆరు గంటల నుంచి గిరి ప్రదక్షిణ, గంగాహారతి కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గంగాహారతి, అన్నదానం ఉంటాయని తెలిపారు.

పుంజుకుంటున్న టమోటా ధరలు

● 30 కిలోల టమోటా క్రేట్ రూ.820



అంగళ్లు మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

కురబలకోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా పతనమైన టమోటా ధరలు క్రమేణా పుంజుకుంటున్నాయి. కొద్ది రోజుల క్రితం టమోటా ధరలు పాతాళానికి పడిపోవడంతో కనీసం గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు నష్టాలను చవిచూశారు. అయితే ప్రస్తుతం టమోటా ధరలు క్రమేణా పుంజుకొంటున్నాయి. కొన్ని రోజులుగా కేవలం 30 కిలోల క్రేట్ రూ.70 నుంచి రూ.150 మధ్య పలికింది. క్రమేణా పదిహేను రోజులుగా ధరలు పుంజుకుంటున్నాయి.

కాగా సోమవారం మండలంలోని అంగళ్లు టమోటా మార్కెట్‌లో 30 కిలోల క్రేట్ ధర రూ.820 పలికింది. కొనుగోలు చేసిన టమోటాలను మహారాష్ట్ర, తమిళనాడు, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా ప్రాంతాలకు తరలిస్తున్నారు. రానున్న రోజుల్లో ధరలు మరింతగా పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

లంకమల్లలోని సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్



ఉప్పుల గుంతలో కూంబింగ్ నిర్వహిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

సిద్దవటం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): లంకమల్ల అభయారణ్యంలోని సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించినట్లు సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ ఆదేశాలతో ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రేళ్లబోడు, గొల్లపల్లె, సిద్దవటం ఫారెస్ట్ బీట్‌లలో సమస్యాత్మక, అనుమానిత అటవీ ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించామన్నారు. అటవీ ప్రాంతంలోని సమీప గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనపడితే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం తెలపాలన్నారు. అటవీ సంపద కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అటవీ ప్రాంతాలను అనుకుని ఉన్న పంట పొలాల్లోకి వన్యప్రాణులు సంచరిస్తే ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా గ్రామస్థులు వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ఓబులేశు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం లాభదాయకం



పంటలను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రకృతి సేద్యం అధికారి విజయ్

సుండుపల్లె, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యం లాభదాయకమని రాష్ట్ర ప్రకృతి సేద్యం వ్యవసాయ పరిశీలకుడు విజయ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రానికి సమీపంలోని ప్రకృతి సేద్యం సహాయకుడిగా పనిచేస్తున్న వీరనాగయ్య పొలాన్ని పరిశీలించి స్థానిక రైతులకు ప్రకృతి సేద్యం ఆవశ్యకతను తెలియజేశామన్నారు. పంటల జీవవైవిధ్యం గురించి, అదే విధంగా ప్రకృతి సేద్యం వలన నిరంతరం ఎలా ఆదాయం పొందాలనే విషయాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారి లోకేశ్, పీడీఎఫ్ రమేశ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

అక్రమ బియ్యం ఎందుకు వదిలేశారు

- పీలేరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో గత మే 11న రేషన్ బియ్యం పట్టుకొన్న పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా ఎందుకు వదిలేశారో చెప్పాలని పీలేరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఆ ఫిర్యాదు మేరకు అక్రమంగా నిలువ చేసి రవాణా చేస్తున్నారనే సమాచారంతో పీలేరు పోలీసులు చాకచక్యంగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు బియ్యం లోడు చేసిన లారీలను, రవాణా చేస్తున్న వారిని తరలించారని, సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో పెట్టుకుని సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఎందుకు వదిలేశారో సమాధానం చెప్పాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు

రైల్వేకోడూరురూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పండించే కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయంతో పండించే ఆకుకూరలు, కూరగాయలను ఒక స్టాల్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ఆరోగ్యకరమైన ఉత్పత్తులు కొనుగోలు చేయాలని, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చియ్యవరం యూనిట్ ఇన్‌చార్జ్ సుబ్బరాయుడు, వీపీఆర్ కండ్రిక ఇన్‌చార్జ్ గోవింద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్

రాయచోటిటౌన్, జూన్9(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 14, 15వ తేదీల్లో జరగనున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర 11వ మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏవీ రమణ పిలుపునిచ్చారు. సోమవారం రాయచోటి విద్యుత్‌శాఖ కార్యాలయం ఆవరణంలో మహాసభలకు సంబంధించి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిస్కం అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, నాయకులు శ్రీనివాసులునాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్‌బాషా, నాగభూషణం, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రశంసించిన కలెక్టర్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన రైల్వేకోడూరు విక్టరీ హైస్కూల్ విద్యార్థులు చరితార్థ, వైష్ణవిని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అభినందించారు. సోమవారం రాయచోటి కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డును ప్రదానం చేసి రూ.20 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని చరితార్థని మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వం అందించిన నగదును అనాథ శరణాలయానికి ఇస్తున్నట్లు తెలిపారు. మరో విద్యార్థిని వైష్ణవి మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన నగదును పై చదువులకు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు కలెక్టర్‌తో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి :సీఐటీయూ

రాజంపేటటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారంలో అన్యాయంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యాలయ ఆవరణంలో సోమవారం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు మణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శి సీవీ రమణ, ప్రసాద్, ఓబయ్య, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'యువతకు శాపంగా మారిన ఐపీఎల్ మ్యాచ్‌లు'

రైల్వేకోడూరురూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యువతకు శాపంగా మారిన ఐపీఎల్ మ్యాచులను వెంటనే రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దార్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఐపీఎల్ వల్ల యువత బెట్టింగ్‌లకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. బెంగళూరు సంఘటన యావత్ ప్రపంచాన్ని కదిలించిందని ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని తమ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి శెట్టిపల్లి పెంచలయ్య, మండల నాయకులు పాలతోటి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఎంపీడీవో







పుల్లంపేటలో యోగాంధ్ర కార్యక్రమంలో ఆసనాలు వేస్తున్న అధికారులు, ప్రజలు, రాయచోటిలో యోగాంధ్ర కార్యక్రమానికి ర్యాలీగా వెళుతున్న అగ్నిశాఖల అధికారులు, గాలివీడులో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న దృశ్యం

పుల్లంపేట/సుండుపల్లె/వీరబల్లి/సిద్దవటం/నందలూరు/ఒంటిమిట్ట/రామాపురం/గాలివీడు/సంబేపల్లె/లక్కిరెడ్డిపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వయసుతో తేడా లేకుండా ప్రతిఒక్కరూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పుల్లంపేట ఎంపీడీవో శిరీషా పేర్కొన్నారు. సోమవారం ఉదయం స్థానిక ఎస్‌బీవీడీ మైదానంలో అధికారులు, ప్రజలు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గోసేవక సంఘం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నవారు ఎంపీడీవోను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో పాటు సర్పంచ్‌లు ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, మణికంఠ, బీజేపీ మండల ఇన్‌చార్జి మనోహర్‌రెడ్డి, యోగాంధ్ర జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అదేవిధంగా సుండుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో తహసీల్దార్ దైవాదీనం ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్ ట్రైనర్స్, సుండుపల్లె ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు రాధారాణి యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా వీరబల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, తహసీల్దార్ వెంకటేశ్, ఈవోపీఆర్‌డీ రామచంద్రారెడ్డిల ఆధ్వర్యంలో.. ఇక సిద్దవటంలో మండల విస్తరణాధికారి మెహతాబ్ యాస్మిన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పంచాయతి సెక్రటరి రాజేష్, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు. నందలూరులో... ఎంపీడీవో రాధాకష్ణ సౌమ్యనాథస్వామి ఆలయంలో సోమవారం ఆహ్లాదకరమైన వాతావరణంలో యోగా నిర్వహించారు. అనంతరం సౌమ్యనాథస్వామి ఆలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. అంతేకాకుండా ఒంటిమిట్టలో.. ఎంపీపీ నల్లగొండ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఒంటిమిట్టలోని పురవీధుల్లో యోగాంధ్రపై ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ గౌస్‌బాషా, ఎంపీపీ ప్రతినిధి వెంకటసుబ్బారెడ్డి, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఎంఈవో వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

అదేవిధంగా రామాపురంలో.. మండల ప్రత్యేక అధికారి విశ్వనాథ్, తహసీల్దార్ రామాంజనేయులు యోగా మాస్టర్ల శిక్షణలో యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పట్నాయక్, ఉపాధిహామీ ఏపీవో పెంచలయ్య పాల్గొన్నారు. గాలివీడులో తహసీల్దార్ భాగ్యలత, ఎంపీడీవో జవహర్‌బాబు, ఎంఈవో నాగరాజుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబేపల్లెలో.. మండల స్పెషల్ ఆఫీసర్, డీపీవో మస్తాన్‌వల్లి, ఎంపీడీవో రామచంద్ర, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డిలు యోగా దినోత్సవం నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లెలో ఎంపీడీవో ఉషారాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉషారాణితో పాటు అన్ని శాఖల అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది యోగాంధ్ర నిర్వహించారు.

మూడు బైకులు ఢీ - ఒకరు మృతి

- ఏడుగురికి గాయాలు



మృతిచెందిన మోహన్ (ఫైల్)

రాజంపేటటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని గుండ్లూరు సమీపంలో 3 బైకులు ఢీకొన్న సంఘటనలో మోహన్(20) మృతి చెందాడు. జగదీష్ రాజా, హనుమంత్, రామ్మోహన్, మారె నరసింహ, ఆదినారాయణ, నారాయణ, ఆదిలక్షుమ్మలకు గాయాలయ్యాయి. సోమవారం రాత్రి మోహన్ ఇద్దరు స్నేహితులతో కలిసి నందలూరు వైపునకు వెళ్లారు. అదే సమయంలో గుండ్లూరు వైపు నుంచి వస్తున్న మరో రెండు బైకులను ఢీకొన్న సంఘటనలో ఈ ప్రమాదం జరిగింది. మృతి చెందిన మోహన్ తెనాలి నిడుబ్రోలుకు చెందినవారని, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. కాగా తీవ్ర గాయాలపాలైన జగదీష్, మారె నరసింహలను మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతికి తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..



మృతి చెందిన నాగరాజు

సంబేపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలో ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రమాదంలో నాగరాజు (52) వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశ్‌నగర్ కాలనీకి చెందిన నాగరాజు రాయచోటి పట్టణంలో ఓ ప్రైవేటు నర్సింగ్ హోంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. పనిముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఎర్రగుంట్ల బస్టాండు సమీపానికి రాగానే రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తలకు హెల్మెట్ ఉన్నా రక్తగాయాలు కావడంతో అతన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు.

'రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి'

రాయచోటిటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు, కౌలు రైతులకు అన్ని రకాల పంటలకు అవసరమైన, నాణ్యమైన విత్తనాలు తక్షణమే సబ్సిడీతో ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వరమ్మ, రైతు సంఘం రాయచోటి ఏరియా అధ్యక్షుడు హరినాథనాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

ఓబులవారిపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మవరం గ్రామ పంచాయతీలో పూర్వకాలం నుంచి వెలసి ఉన్న పార్వతి వర్దని సమేత రామలింగేశ్వరాలయం పునఃప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం కల్యాణం నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు. మండల పూజ అనంతరం కంచికామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామి వారి బృందం విశిష్ఠ పూజలు నిర్వహించి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి భార్య ముక్కా వరలక్ష్మీ హాజరయ్యారు. అలాగే పలువురు రాజకీయ నాయకులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మీ సొమ్ముకు మీదే బాధ్యత : సీఐ

సిద్దవటం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చోరీలు అరికట్టేందుకు గృహ నిర్వాహకులు జాగ్రత్త వహించాలని, దూర ప్రయాణం వెళ్లేటప్పుడు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి వెళ్లాలని ఒంటిమిట్ట సీఐ బాబు అన్నారు. మండల కేంద్రమైన సిద్దవటం పోలీసుస్టేషన్‌లో సోమవారం సీఐ మాట్లాడుతూ చోరీల నియంత్రణ కట్టడికై ప్రజలకు అవగాహన కల్పించారు. కొంతమంది ఇంటికి తాళాలు వేసి సమాచారం తెలపకుండా వెళుతున్నారని, తమకు సమాచారం ఇస్తే ఆ ప్రాంతాల్లో పోలీసు నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. కొత్త వ్యక్తులు, అనుమానితులు ఎవరైనా గ్రామాల్లో సంచరిస్తే స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండ సీఎం సహాయనిధి

చిట్వేలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి ఆర్థిక అండ సీఎం సహాయనిధి అని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. ఈ మేరకు సీఎం సహాయనిధి ద్వారా వచ్చిన రూ.3,78,865 చెక్కులను మండలంలోని ఏడుగురికి వారి నివాసానికి వెళ్లి ముక్కా రూపానందరెడ్డి తనయుడు విశాల్‌రెడ్డి, ముక్కా సాయివికాస్ రెడ్డితో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పందించే ప్రభుత్వమిది అన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి నరసింహ, మాదాసు నరసింహ, ఏదోటి రాజశేఖర్, శివరాజు, కొనిశెట్టి సుబ్బరాయుడు, మధు, సాయినాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను తొలగించడం దుర్మార్గం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

రాయచోటిటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించడంతో పాటు ఏపీకి తలమానికంగా ఉన్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో 5400 మంది కార్మికులను తొలగించడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న కార్మికుల సమ్మెకు సంఘీభావంగా సోమవారం రాయచోటి పట్టణంలోని మున్సిపల్, విద్యుత్, గ్రామ పంచాయతీ కార్మికులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యకర్తలు తిరుపాల్, చెన్నయ్య, నరసింహులు, ఓబులేసు, కాంతారావు, అశోక్, రమణ, మంగమ్మ, నాగమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకి మతి భ్రమించినట్లుంది

- టీడీపీ నాయకుడు మడితాటి రవీంద్రారెడ్డి

సంబేపల్లె, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి మతి భ్రమించినట్లు ఉందని టీడీపీ నాయకుడు మడితాటి రవీంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన గెలిస్తే సక్రమం, ఇతరులు గెలిస్తే అక్రమం అవుతుందా అని తెలిపారు. ఈవీఎంల పనితీరుపై ఎన్నికల ఫలితాలు వచ్చిన ఏడాదికి అనుమానం రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

వైసీపీ నేతలకు చిత్తశుద్ధి లేదు

చిట్వేలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అమరావతిపై వైసీపీ నేతలకు చిత్తశుద్ధి లేదని మండల జనసేన నాయకులు మాదాసు నరసింహ ఆరోపించారు. ఈ మేరకు అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసుస్టేషన్‌లో జనసైనికులతో కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పెంచలయ్య, శివ, సాయి, హరిప్రసాద్, సాయి, రాజా, ప్రణీత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గావు కార్యక్రమం

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం

సుండుపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా నాగారపమ్మ జాతర జరుగుతోంది. ఇందులో భాగంగా సోమవారం ప్రదాన ఘట్టమైన గావు కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మూడు రోజు పూజల్లో భాగంగా ఆలయ పూజారులు ఆలయం ఎదుట ఉన్న పుట్టబంగారం తీసుకొచ్చి ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. ఆలయం ఎదురుగా వేసిన గుర్రపుస్వామి ముగ్గు వద్ద ఆలయ ఆసాది నాగసిద్దయ్య అమ్మవారిపై ఆశాధికత వినిపించారు. మొక్కుబడుల్లో భాగంగా పలువురు మహిళలు వరపడే కార్యక్రమం చేపట్టారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని అర్చనలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివిధ పోలీస్‌స్టేషన్ నుండి ఎస్ఐలు, పోలీసులు పాల్గొని బందోబస్తు నిర్వహించారు.

'నిషిద్ధ జాబితా నుంచి మా భూమిని తొలగించండి'

రాజంపేటటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నిషిద్ధ భూజాబితా 22-ఎ నుంచి తమ భూమిని తొలగించాలని రాజంపేట మండల పరిధిలోని మన్నూరు గ్రామానికి చెందిన చిట్టే రమణమ్మ సోమవారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 398 సర్వేనంబరులో గల 33 సెంట్ల జాగా తన భర్త చిట్టే గురుప్రసాద్‌కు ఆయన తాత సుబ్బదాస్ ద్వారా సంక్రమించిందని, తన భర్త మరణానంతరం పిత్రార్జిత వారసత్వ రీత్యా తనకు సంక్రమించిందని తెలిపారు. గత 90 ఏళ్లుగా తమ అనుభవంలో ఉన్న ఆ జాగాను రాజంపేట రెవెన్యూ కార్యాలయం 22ఏ నిషిద్ధ జాబితాలో చేర్చారని, తమ వద్ద సరైన అన్ని ధ్రువపత్రాలు ఉన్నప్పటికీ రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా తనకు న్యాయం జరగడం లేదని తెలిపారు. కలెక్టర్ చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై నిరసన



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

రైల్వేకోడూరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్స్ కార్మికులకు ఎటువంటి బెనిఫిట్ లేకుండా నిర్లక్ష్యంగా యాజమాన్యం 5400 మందిని తొలగిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. సోమవారం పట్టణంలోని టోల్‌గేట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కుటమి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటీకరించేందుకు కుట్రలో భాగంగా కార్మికుల తొలగిస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ పోరాట కమిటీ జేఏసీ కన్వీనర్ ఆర్ వెంకటేష్, ఏపీఎండీసీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసులు, సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు యానాదయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి విశ్వనాథ్



కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ (ఎంఎల్) విశ్వనాథ్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ కులస్తులకు వత్తాసు పలుకుతూ దళితుల భూములను తారుమారు చేస్తూ ఇబ్బందులు పెడుతున్న వీరబల్లి తహసీల్దార్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరబల్లి మండలం, సదరు గ్రామ సర్వేనెంబర్ 575/2లో 4.10 సెంట్లలో ఉన్న భూమిని అగ్రవర్ణాల వారు ఆక్రమించాలని చూస్తున్నారని, ఇందుకు రెవెన్యూ సిబ్బంది సహకరించడం సరైంది కాదని వాపోయారు. అనంతరం బాధితులతో కలిసి డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి

లక్కిరెడ్డిపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అనంతపురం, దిన్నెపాడు, కృష్ణాపురం గ్రామాల్లో ఏ గ్రేడ్ ఏటీఎం మోడల్ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన పంటసాగుకు 40 రోజుల ముందు ప్రతిఒక్కరూ 30 రకాల విత్తనాలను భూములో సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

రాయచోటి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషిక్తుడైన రోజును పురస్కరించుకొని జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పురవీధుల్లో హిందూ సామ్రాజ్య దినోత్సవంపై హిందూ బంధువులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రాయచోటి పట్టణ పరిధిలోని మంగళకాలనీలో గల సత్యనారాయణస్వామి ఆలయం నుంచి బైకులకు జెండాలు ధరించి నినాదాలు చేస్తూ కొత్తపేట రామాపురం, గాలివీడు రోడ్డు, కొత్తపేట, జగదాంబసెంటర్, మదనపల్లె రోడ్డు, చెక్‌పోస్టు శివాలయం, నేతాజీ సర్కిల్, బస్టాండు, హరినాథవీధి మీదుగా మాండవ్యనది ఒడ్డున వెలిసియున్న ప్రాచీన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

నాణ్యమైన విత్తనాల ఎంపిక తప్పనిసరి



శాస్త్రవేత్తలతో రైతులు

సుండుపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలను రైతులు ఎంపిక చేసుకొని పంటలు సాగు చేయాలని పరిశోధకులు డాక్టర్ మీనా తెలిపారు. సోమవారం మండల కేంద్రానికి సమీపంలోని తిమ్మసముద్రం, సుండుపల్లె రైతు సేవా కేంద్రాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలతో పాటు మంచి దిగుబడులు సాధించాలంటే సంబంధిత అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ వి.శిల్పకళ, అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ ముకుందలక్ష్మి, ఏఓ మహబూబ్ బాషా, డీఆర్‌సీ ఏడీఏ అశోకొరెడ్డిలు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రశాంతి, ముకుంద మల్లికార్జున, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దాణాను సద్వినియోగం చేసుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పాడి పశువుల రైతులకు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న పశువుల దాణాను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ డీడీ మాలకొండయ్య పేర్కొన్నారు. సోమవారం పందిళ్లపల్లె గ్రామంలో దాణాను మండల యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్, డీడీ మాలకొండయ్యలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 50 టన్నుల దానా మంజూరైందని తెలిపారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె పశుసంవర్ధకశాఖ ఏడీహెచ్ బెనర్జీ, పందిళ్లపల్లె పశువైద్యాధికారి మహేశ్, మూగి రమణ, భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు, పాడి రైతులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలను వేరు చేయండి



డస్ట్‌బిన్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి సేకరించే తడి, పొడి చెత్తలను వేరు చేయాలని పంచాయతీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, టీడీపీ మండల యువజన నాయకులు మదన్ మోహన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో లక్కిరెడ్డిపల్లె ప్రజలకు డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ డాక్టర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, పారిశుధ్య కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

అమ్మో.. జాక్‌పాట్!

ప్రకృతి వైపరీత్యాలు, పెట్టుబడి కోసం చేసిన అప్పులకు పెరిగిపోతున్న వడ్డీలు, మార్కెట్‌లో ఒడిదుడుకులతో ఏటేటా తీవ్రంగా నష్టపోతున్నరైతులను జాక్‌పాట్ భూతం మరింతగా కుంగదీస్తోంది. ఎండా, వానా, పగలు, రేయనక కష్టించి పండించి మార్కెట్‌కు తరలించిన టమోటాల్లో 10 శాతం పైగా జాక్‌పాట్ భూతం అప్పనంగా మింగేస్తోంది. దీంతో మంచి ధర పలికినపుడు సైతం సంతోషమన్నది రైతు గడపదాకా చేరకుండా పోతోంది.



- తీవ్రంగా నష్టపోతున్నరైతులు
- మారని వ్యాపారుల తీరు
- కొత్త పాలకవర్గం సమస్య పరిష్కరించేనా?

గుర్రంకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): టమోటా మార్కెట్‌లో జాక్‌పాట్ భూతం రైతులను పట్టి పీడిస్తోంది. మార్కెట్‌కు టమోటాలు తెచ్చిన ప్రతిసారీ రైతు వేలాది రూపాయల మేరకు నష్టాలను మూటగట్టుకుంటున్నాడు. మంచి ధర పలికే సమయంలో ప్రతి రైతూ తెలిసి తెలిసీ లక్షలాది రూపాయలను జాక్‌పాట్ రూపంలో కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విధానం రద్దు చేయాలంటూ దశాబ్ధకాలంగా రైతులు మార్కెట్ యార్డు వద్ద ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానం, అధిక కమీషన్‌లను రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నా.. ఆచరణలో అవి నీటిమూటలుగానే మిగిలాయి. దీంతో వ్యాపారులు తాము చేసిందే చట్టమంటూ దోపిడీ కొనసాగిస్తున్నారు.

జాక్‌పాట్ అంటే...

ఓ రైతు 25 కిలోల బరువు గల వంద క్రేట్‌ల టమోటాలను మార్కెట్‌కు తీసుకొస్తే.. అందులో పది క్రేట్లకు ఒక క్రేట్‌ను జాక్‌పాట్‌గా తీసుకుంటారు. దీంతో వంద క్రేట్లకు పది క్రేట్లు జాక్‌పాట్ కింద రైతు నష్టపోతాడు. క్రేట్లకు నిండుగా టమోటాలు లేవంటూ మరొకొన్ని క్రేట్ల టమోటాలను మిగిలిన క్రేట్లపై పోస్తారు. ఇలా రైతు తెచ్చిన వంద క్రేట్లు కాస్తా వ్యాపారులు వేలం నిర్వహించే లోపు 80 క్రేట్లకు వచ్చేస్తాయి.

కొత్తపాలకవర్గం వైపు...రైతుల చూపు

వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి వారం రోజుల క్రితం కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసింది. దీంతో ఏడాదిగా కాలంగా ఖాళీగా ఉన్న చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు భర్తీ అయ్యాయి. మార్కెట్ కమిటీకి వాల్మీకిపురం కంటే గుర్రంకొండ మార్కెట్ యార్డు ద్వారానే ఏడాదికి కోటిపైగా ఆదాయముంది. ఇంతటి ఆదాయమున్న మార్కెట్ యార్డులో రైతులు జాక్‌పాట్ విధానంతో అష్టకష్టాలు పడుతున్నారు. ఈ క్రమంలో కొత్త పాలకవర్గమైనా జాక్‌పాట్ విధానంపై కఠినంగా వ్యవహరించి రైతులకు మేలు చేస్తారని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

జాక్‌పాట్‌ను రద్దు చేయాలి



గుర్రంకొండ మార్కెట్ యార్డులో రైతుల నడ్డి విరుస్తున్న జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలి. ఈ విధానం కారణంగా టమోటాకు ధరలు లేని సమయంలో పెట్టుబడులు కూడా రావడం లేదు. వ్యాపారులు అధిక కమీషన్ వసూలు చేస్తున్నారు. జాక్‌పాట్ విధానం రద్దు చేయాలని పలు మార్లు మార్కెట్ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతస్థాయి అధికారులు కల్పించుకుని రైతుల పాలిట భూతంలా మారిన జాక్‌పాట్‌ను తరిమివేయాలి.

- పి.అమరనాథ్, రైతు గుర్రంకొండ

వ్యాపారులతో మాట్లాడి పరిష్కరిస్తాం



గుర్రంకొండ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంపై రైతుల నుంచి అధికంగా ఫిర్యాదులు అందాయి. మార్కెట్ యార్డులో వ్యాపారులు, అధికారులతో సమావేశం నిర్వహించి జాక్‌పాట్ విధానంపై చర్చిస్తాం. రైతులకు నష్టం కలిగించే జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయించి రైతులను ఆదుకుం టాం. రైతుల సమస్యలను ఒకదాని తరువాత ఒకటిగా పరిష్కరిస్తాం.

-షేక్ నౌషాద్‌అలీ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్

అంతర్ రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ విజేత చెన్నై

పీలేరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు విజేతగా చెన్నై ఎస్ఆర్ఎం టీం నిలిచింది. పీలేరు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిశాయి. ఇందులో మూడు రాష్ట్రాలకు చెందిన 18 టీంలు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్ పోటీలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చెన్నై టీం విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానం కర్ణాటక టీం, తృతీయ స్థానం చెన్నైకి చెందిన ఎస్టీ జోసెఫ్ టీం, నాలుగో స్థానంలో గుంటూరుకు చెందిన సౌత్ సెంట్రల్ రైల్వే జట్టు నిలిచాయి. ఈ కార్యక్రమంలో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, భాస్కర్ రెడ్డి, ఏపీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ, పలువురు పీడీలు, పీఈటీలు, పీలేరు బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.



అంతర్‌రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ కప్పుతో చెన్నై ఎస్ఆర్ఎం టీం

ఎట్టకేలకు ఫలించిన 'ఢిల్లీ రైలు' కల!

- 11 నుంచి రాజంపేటలో సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్

రాజంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీ నగరానికి నేరుగా వెళ్లే రైలుకు రాజంపేటలో స్టాపింగ్ కోసం రెండు దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తిరుపతి నుంచి ఢిల్లీకి వెళ్లే రైలు 12707 సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 11 నుంచి రాజంపేటలో స్టాపింగ్ ఇస్తూ దక్షిణమధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ ఒక ప్రకటన జారీ చేశారు. ఈ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ కోసం రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ద్వారా సాయిలోకేశ్ కేంద్ర మంత్రిని కలిసి విన్నవించారు. ఈ మేరకు రైల్ నంబరు 12707 తిరుపతి-హెచ్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్, 12708 హజరత్ నిజాముద్దీన్ - తిరుపతి సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో ఆగనున్నాయి. ప్రతి సోమ,బుధ , శుక్ర వారాల్లో 12707 ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో ఉదయం 6.43 గంటలకు ఆగి 6.45 కు బయలుదేరనుంది. ఆది,బుధ, శుక్రవారాల్లో 12708 ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో 18.38 గంటలకు ఆగి 18.40 గంటలకు బయలుదేరనుంది. ఈనెల 11న రాజంపేటలో ఆగుతున్న సందర్భంగా రాష్ట్ర రోడ్డు రవాణా యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించనున్నారు. 12708 హజరత్ నిజాముద్దీన్ తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఈనెల 13 నుంచి రాజంపేటలో ఆగనుంది. దీనిని రైల్వే అదికారులు అధికారికంగా ప్రారంభించనున్నారు. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట ప్రధాన రైల్వే స్టేషన్, పార్లమెంటు నియోజకవర్గ కేంద్రంగా, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న రాజంపేటలో ఈ రైలు ఆగడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. రాజంపేట రైల్వేస్టేషన్ మార్గం ద్వారా ప్రతిరోజు 33 రైళ్లు ప్రయాణిస్తూ ఉంటాయి. అందులో కొన్ని రైళ్లు తప్ప మిగిలిన ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ రాజంపేట రైల్వేస్టేషన్‌లో ఆగవు. కరోనా తరువాత గతంలో ఆగే అనేక రైళ్లను కూడా రద్దు చేశారు. ఈ విషయాన్ని గమనించి రాజంపేట రైల్వేస్టేషన్ ప్రాముఖ్యతను వివరిస్తూ కేంద్ర మంత్రులతో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ పలుసార్లు వినతిపత్రాలు సమర్పించగా ఇటీవల పలు రైళ్లు రాజంపేటలో ఆగుతున్నాయి. ఈ నెల 11న సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో స్టాపింగ్ సందర్భంగా రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



కూటమి ప్రభుత్వం ఇచ్చే కానుక : సాయి లోకేశ్

దేశరాజధాని ఢిల్లీకి వెళ్లాలన్నా, అక్కడి నుంచి రావాలన్నా ఈ మార్గంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి రావడానికి ఈ రైలు ఎంతో ప్రయోజకనరమైనది. నా విన్నపాన్ని మన్నించి కేంద్ర బీజేపీ ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం పాలనలో రాజంపేటలో ఈ రైలు స్టాపింగ్‌కు ఉత్తర్వులు జారీ చేయడం చెప్పలేని ఆనందంగా ఉంది. 11వ తేదీ నుంచి రాజంపేటలో సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ ఆగడానికి అధికారికంగా రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉంది.

'తోతాపురి మామిడి'కి మద్దతు ధర

- విధి విధానాలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

రైల్వేకోడూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడి పండ్లకు మద్దతు ధర ప్రకటించింది. ప్రాసెసింగ్ కంపెనీలు కిలోకు రూ.8, రాష్ట్ర ప్రభుత్వం రూ.4 చొప్పున రైతులకు అందజేయనుంది. ఇందుకు సంబంధించిరాష్ట్ర ప్రభుత్వం రైతులకు పలు సూచనలు చేసింది. వివరాలిలా..

మామిడి రైతులు తమ 1బి, ఆధార్ కార్డు, ఆధార్ లింక్డ్ బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను ఫ్యాక్టరీ, ఎఫ్‌పీఓ లేదా మార్కెట్ యార్డుకు తీసుకెళ్లాలి. పక్వానికి వచ్చిన కాయలను దశలవారీగా కోయాలి. ఒకేసారి కోయడం వల్ల ఫ్యాక్టరీల వద్ద రద్దీ ఏర్పడి, యాజమాన్యానికి ఇబ్బంది కలుగుతుంది. ఫ్యాక్టరీకి నేరుగా కాయలు తీసుకెళ్లే రైతులు పైన పేర్కొన డాక్యుమెంట్లను తప్పనిసరిగా తీసుకెళ్లాలి. అక్కడ విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు రైతుల వివరాలను నమోదు చేస్తారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా రైతు, పంట వివరాలను నమోదు చేస్తుంది. ప్రభుత్వ మద్దతు ధర నేరుగా రైతు ఖాతాలో జమ అవుతుంది. ఫ్యాక్టరీ చెల్లించే మొత్తం కూడా రైతు ఖాతాలోనే జమ అవుతుంది. మార్కెట్ యార్డు లేదా ఎఫ్‌పీఓకు కాయలు తీసుకెళ్లే రైతులు ఆయా డాక్యుమెంట్లను తీసుకెళ్లి, అక్కడ విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి వద్ద నమోదు చేయించుకుని, మార్కెట్ యార్డు ఎఫ్‌పీఓకు కాయలను అమ్మాలి. ఉదాహరణకు, ఇద్దరు రైతులు 5 టన్నుల చొప్పున కాయలు అమ్మితే, మార్కెట్ యార్డు వారు నాణ్యత తనిఖీ చేసి, రైతులకు నేరుగా లేదా డిజిటల్ విధానంలో నగదు చెల్లిస్తారు. మార్కెట్ యార్డు వారు ట్రాకులో లోడ్ చేసిన తర్వాత ఏ రైతుకు సంబంధించిన సరుకు ఏ, ఫ్యాక్టరీకి వెళ్తుందనే విషయాన్ని ప్రభుత్వ ఉద్యోగి నమోదు చేస్తారు. ఈ వివరాలను ఫ్యాక్టరీ వద్ద ఉన్న ప్రభుత్వ ఉద్యోగికి అందజేస్తారు. ప్రభుత్వం రూ.4 మద్దతు ధరను రైతు ఖాతాలో నేరుగా జమ చేస్తుంది. రైతులు ఈ నెల 9వ తేదీ నుంచి తమకు అనుకూలమైన ఫ్యాక్టరీ లేదా మార్కెట్ యార్డు యాజమాన్యంతో సంప్రదించి కాయలను కోయడం ద్వారా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవచ్చుని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు ఒక ప్రకటనను విడుదల చేశారు.

ఆటోనగర్ ప్రారంభానికి చర్యలు

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



వలసపల్లె పంచాయతీలోని ఆటోనగర్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని ఆటో కార్మికులకు కలగా మిగిలిపోయిన ఆటోనగర్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీలోని 33 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఆటోనగర్ స్థలాన్ని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తితో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆటోనగర్‌కు కేటాయించిన స్థలంలో కొంత స్థలం ముగ్గురు రైతులు కోర్టులో కేసు వేశారని, ఈ ముగ్గురు రైతులకు నచ్చజెప్పి తగిన నష్టపరిహారం ఇచ్చేలా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ విషయమై ఏపీఐఐసీ అధికారులతో కూడా చర్చించామన్నారు. త్వరలో ఆటోనగర్ ప్రారంభానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, సర్వేయర్ రెడ్డిశేఖర్‌బాబు, టీడీపీ నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తితో అధిక ఆదాయం

- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మణిమురుగన్



మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మణి మురుగన్

పుల్లంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విత్తనోత్పత్తితో రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని భారత నూనెగింజల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మణిమురుగన్ తెలిపారు. అన్నమయ్య జిల్లా ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని అనంతసముద్రం, అప్పయ్యరాజుపేట గ్రామాల్లో కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతుల ప్రత్యక్ష సంభాషణలను వారికి ఖరీఫ్ పంట కాలం ముందు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. 700 జిల్లాల్లో 2 వేల మంది కంటే ఎక్కువ భాగస్వామ్యంతో నూతన సాంకేతికత, ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. నువ్వులు, పొద్దుతిరుగుడు విత్తనాలు మేలైన రకాల యాజమాన్య పద్ధతులు, సాగులో సాంకేతికత, డ్రోన్లపై వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ మాధవి మాట్లాడుతూ ప్రధాన పంటల్లో జీవన ఎరువులు, జీవ నియంత్రకాల వాడకంపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మానస మాట్లాడుతూ మామిడి, అరటి, బొప్పాయ, చీనీ, నిమ్మ తోటల్లో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పుల్లంపేట వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు సంఘాలుగా ఏర్పడి లాభసాటి వ్యవసాయం వైపు సాగాలని తెలియజేస్తూ ప్రభుత్వ పథకాలను వివరించారు. నేల సమతుల్యతను కాపాడే విధంగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సుచిత్ర మాట్లాడుతూ అంతర పంటల ప్రాముఖ్యత, పంట మార్పిడి, అధిక దిగుబడిని ఇచ్చే నూతన వంగడాల ప్రాముఖ్యతపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బీటీఎం సుబ్రమణ్యం, గ్రామీణ వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతు ఉత్పత్తిదారులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి : ఎస్పీ



బాధితుల వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోపు విచారణ చేసి సత్వరం పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మం ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రానికి రాలేని వారు తమకు సమీపంలోని పోలీసు స్టేషన్లు, సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో అర్జీలు సర్పించవచ్చునన్నారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలు తెలుసుకుని సత్వరం న్యాయం చేస్తామన్నారు.

ఫిర్యాదుదారుల వద్దకు ఎస్పీ..

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ సమస్యలు వినిపించేందుకుగుర్రంకొండ మండలం సూరప్పగారిపల్లె నుంచి ఇడగొట్టి పుష్పలత జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేశారు. ఆమె నడవలేని స్థితిలో ఉన్నట్లు తెలుసుకున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆమె వద్దకే వెళ్లి సమస్యను విన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ చట్ట పరిధిలో ఆమె సమస్యను పరిష్కరించాలని గుర్రంకొండ ఎస్ఐని ఆదేశించారు. చిన్నమండెం మండలం పఠాన్ అమీరుల్లాఖాన్ అనే వృద్ధుడి వద్ధుఉ వెళ్లి సమస్యను విన్నారు. ఆయన సమస్యను పరిష్కరించాలని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్‌ను ఆదేశించారు.

ప్రజల సమస్యలు తక్షణం పరిష్కరించాలి: డీఆర్‌వో



వినతిపత్రాలు స్వీకరిస్తున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డీఆర్‌వో మధుసూదన్‌రావు సూచించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేదిక ద్వారా అందిన ప్రజల అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు.ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందన్నారు. ప్రతి సమస్యపై ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ఫిర్యాదులను వంద శాతం పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి సమస్యను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. కొంత మంది అర్జీదారులు పదే పదే వస్తున్నారని అలా కాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలదేన న్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్‌డీసీ రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లాలో ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

రాయచోటిటౌన్, జూన్9(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లెలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల, మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సోమవారం 6 పరీక్షా కేంద్రాల్లో 1092 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 951 మంది హాజరుకాగా 141 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలియజేశారు.



భాస్కర్ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

ఇద్దరు దొంగల అరెస్ట్

- 75 గ్రాముల బంగారు, 226 గ్రాముల వెండి నగలు స్వాధీనం
- పట్టుబడినవారు 9 కేసుల్లో నిందితులు



పట్టుబడిన దొంగలు, స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న ఏఎస్పీ మనోజ్ హెగ్డే

పీలేరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద రూ. 8 లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ హెగ్డే తెలిపారు. పీలేరు పట్టణ శివారు ప్రాంతంలోని కోళ్లఫాం వద్ద సోమ వారం మదనపల్లెలోని చీకటిగుట్ట ప్రాంతానికి చెందిన కావడి సోమ శేఖర్(29), పీలేరులోని ఎస్టీ కాలనీకి చెందిన జరుపుల మణికంఠ (27)ను అదుపులోకి తీసుకుని 75 గ్రాముల బంగారు, 226 గ్రాముల వెండి నగలు, హీరోహోండా స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెపారు. నిందితులపై పీలేరులో 3 కేసులు, కలికిరిలో రెండు, మదనపల్లెలో రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు పోలీస్ విచారణలో వెలుగుచూసింది. కావలి సోమశేఖర్‌పై 15 కేసులు నమోదైఉండగా, రెండవ ముద్దాయి మణికంఠ పీలేరు మండ లం యర్రగుంటపల్లె పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో ఉంటూ భార్య హత్య కేసులో జైలుకు వెళ్లాడు. జైలులో ఉన్నపుడు ఇరువురి మధ్య పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలయ్యాక ఇరువురూ ద్విచక్ర వాహనంపై తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడేవారని ఏఎస్పీ తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

విడిగా ఉండే ఇళ్ల వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏఎస్పీ సూచించారు. ఇంటి వద్దకు ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చినపుడు కిటికీ ద్వారా పరిశీలించి తలుపులు తీయాలని సూచించారు. ద్విచక్రవాహనాలపై సంచరించే కొత్త వ్యక్తులపై నిఘా ఉంచి అనుమానాస్పదంగా అనిపిస్తే పోలీసులకు సమా చారం అందించాలని కోరారు. ఇళ్లకుతాళం వేసుకొని ఊర్లకు వెళ్లేటపుడు పోలీసులు, ఇ రుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఖరీదైన బంగారు, నగదు తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు.

ఎస్పీ అభినందన

ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేయడంతో పాటు, చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంతో కీలకంగా వ్యవహరించిన పీలేరు సీఐ యుగంధర్, ఎస్ఐ లోకేశ్, సిబ్బంది శ్రీనివాసులు, రాధాకృష్ణ, ఉపేంద్ర, తిరుపాల్ నాయక్, జగదీశ్‌ను ఎస్పీ అభినందించారు. విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ ఇంజనీర్లపై విచారణ

కలికిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం జలవనరుల శాఖ కడప సర్కిల్ పరిధిలో పనిచేసిన ఐదుగురు ఇంజనీర్లపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఇందుకు సంబంధించి విచారణాధికారిని నియమిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. కడప జిల్లా కలసపాడు మండలం బ్రాహ్మణపల్లెలో రాచెరువు పటిష్టీకరణతోపాటు, నీటి పారుదల కాలువల అభివృద్ధి పనులకు ప్రపంచ బ్యాంకు నిధులు మంజూరు చేసింది. ఈ పనులను పూర్తి చేసే క్రమంలో సంబంధిత ఇంజినీర్లు తీవ్రమైన అక్రమాలకు పాల్పడ్డట్లు విజిలెన్స్ గుర్తించింది. ఈ అవకతవకలకు సంబంధించిన వివరాలను సాక్ష్యాధారాలతో 2021 అక్టోబరు 18న ప్రభుత్వానికి అందజేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది. ఇది గడిచిన అనంతరం ప్రభుత్వం తాపీగా సరిగ్గా ఏడాది తరువాత 2022 అక్టోబరు 18 బాధ్యులైన ఐదుగురు ఇంజనీర్లకు నామమాత్రంగా నోటీసులు అందజేసి పది రోజుల గడువుతో సంజాయిషీలు కోరింది. అంతటితో ఇది మూలన పడింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఐదుగురు ఇంజనీర్లు సమర్పించిన సంజాయిషీలను పరిశీలించి తదుపరి విచారణకు ఆదేశాలు జారీ చేసింది. అప్పట్లో ఈ పనులను పర్యవేక్షించిన జలవనరుల శాఖ ఈఈ ఎం.కొండారెడ్డి(ప్రస్తుతం రిటైరయ్యారు), మరో ఈఈ ఇ.మల్లికార్జున, డీఈఈలు ఎం.వి. రమణారెడ్డి, టి.మల్లికార్జున, ఏఈఈ ఎస్.ఫణీంద్ర సింగ్‌లు విచారణను ఎదుర్కోవలసి వుంది. విచారణాధికారిగా కడపలోని రాయలసీమ రీజియన్ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీరు ఎం.కిరణ్ కుమార్‌ను విచారణాధికారిగా నియమించింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

కిటకిటలాడిన మల్లయ్య కొండ



నృత్యాలు చేస్తున్న గొరవయ్యలు

తంబళ్లపల్లె, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగుస్తుండడంతో స్థానిక మల్లయ్యకొండలో ఉన్న భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని సోమవారం పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.దీంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది.అర్చకుడు ఈశ్వరప్ప స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల పేరిట అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వ హించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో మల్లయ్యదారులు పిల్లనగ్రోవి వాయిద్యాలతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బంది కలుగకుండా కొండపైన అన్ని సౌకర్యాలు కల్పించారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు, విద్యార్థులు

ముద్దనూరులో రైళ్ల నిలుపుదల ఎప్పుడో..!

ముద్దనూరు జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు రైల్వే స్టేషన్‌లో విజయ వాడకు వెళ్లే రైళ్లను తప్పనిసరిగా నిలపాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ముద్దనూరు రైల్వేస్టేషన్ ఉన్నప్పటికి చాలా వరకు రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం దీనిపై ఎందుకు స్పందించడం లేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

ముద్దనూరు ఒక్కప్పుడు సమితి కేంద్రంగా ఉండేది. కొండాపురం మండలం కూడా ముద్దనూరు సమితీలో ఉండేది. అంటే ముద్దనూరు అంత ప్రాధాన్యత కలిగి ఉండేది. మండల కేంద్రంలో వ్యవసాయశాఖ ఏడీ, ఉద్యానశాఖ, పశువైద్యశాల ఏడీ, అటవీశాఖ రేంజి, ఐసీడీఎస్ కార్యాలయాలు ఉన్నాయి. అంతేకాకుండా జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతాల నుంచి ప్రజలు చెన్నై, హైదరాబాదు, ముంబైకు రైలు ప్రయాణం చేయాలన్న ముద్దనూరు రైల్వే స్టేషన్‌కు వస్తారు. నిమ్మకాయల ఎగుమతి కూడా ఎక్కువగా ఇక్కడి నుంచే జరుగుతుంటుంది. కరోనా సమయంలో చాలా రైళ్లను నిలిపివేశారు. కానీ రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి కేంద్రంగా ఉంది. ప్రస్తుతపరిస్థితుల్లో ముద్దనూరు, పులివెందుల ప్రజలు అమరావతికి వెళ్లాలన్నా, విజయవాడ, గుంటూరులో చదువుకునే విద్యార్థులు ముద్దనూరులో రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ధర్మవరం నుంచి విశాఖపట్నంకు ఎర్రగుంట్ల మీదుగా రైలు నడుస్తుంది. ప్రస్తుతం మరో రైలు గుంతకల్లు నుంచి కడప మీదుగా విజయవాడకు పునరుద్ధరించారు. ఈ రెండింటికి ముద్దనూరు స్టేషన్‌లో స్టాపింగ్ లేదు. చాలా చోట్ల ప్రజాప్రతినిధులు, సంఘాలు పోరాడి స్టేషన్‌లలో స్టాపింగ్ చేయిచుకుంటున్నా ఎంతోప్రాధాన్యత ఉన్న ముద్దనూరులో అమరావతికి వెళ్లే రైళ్లకు స్టాపింగ్ లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రజల సౌకర్యార్థం రైళ్లను ముద్దనూరు స్టేషన్‌లో నిలపేటట్లు ప్రజాప్రతినిధులు, గుంతకల్ రైల్వే డివిజన్ అధికా రులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రైళ్లు నిలపాలి

ముద్దనూరు స్టేషన్‌లో విజయవాడ వెళ్లే రైళ్లకు స్టాపింగ్ ఉంటే సౌకర్యంగా ఉంటుంది. బస్సుల్లో వెళ్లాలంటే చార్జీ ఎక్కువగా ఉంటుంది. సమయానికి రిజర్వేషన్ సీట్లు దొరకవు. దీంతో సెలవుల్లో ఇంటికి వచ్చి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నాం. రైళ్లకు ఇక్కడ స్టాపింగ్ ఉంటే రిజర్వేషన్ సౌకర్యం లేకున్నా, జనరల్‌లో ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది.

-ఉమామహేశ్వర్, విద్యార్థి, ముద్దనూరు

ఉత్సాహంగా సౌత్‌జోన్ మహిళా క్రికెట్

● ఐదు జిల్లాల క్రీడాకారిణిల హాజరు



పోటీలను ప్రారంభిస్తున్న ఎన్‌డీసీఏ ప్రతినిధులు

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని సీఏ క్రీడామైదానంలో సోమవారం అండర్-15 మహిళల ఏసీఏ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభ మయ్యాయి. అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన క్రికెట్ క్రీడాకారిణిలు ఈ పోటీలకు హాజరయ్యారు. వారంపాటు పోటీలను నిర్వహించనున్నారు. తొలిరోజు పోటీల్లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 288 పరుగులు సాధించింది. ఈ జట్టులోని ఈ.గేయకీర్తి 120 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 118 పరుగులకే ఆలౌట్ కావడంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అనంతపు రం, కర్నూలు జట్లు తలపడగా, టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంత పురం జట్టు 16 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 78 పరుగులు మాత్రమే సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 21.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 81 పరుగులతో విజయం సాధించింది. తొలిరోజు ఈ పోటీలను ఎన్‌డీసీఏ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కే.శ్రీనివాసుల రెడ్డి, జనరల్ మేనేజర్ పీ. భాను ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యులు బీ.లీలామోహన్‌రెడ్డి, ఏసీఏ అంపైర్స్ పవన్‌కిషోర్, త్రినాథ్ పర్యవేక్షించారు.

ఈతకు వెళ్లి... సంపులో మునిగి చిన్నారులు మృతి



సంపులో పడి మృతి చెందిన రాముడు, లక్ష్మణుడు

చక్రాయపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తల్లితండ్రీ లేని ఇద్దరు అనాథ పిల్లలు ఈత కోసం వెళ్లి నీటి సంపులో మునిగి మృతి చెందారు. ఈ విషాదకర ఘటన ఆదివారం రాత్రి చక్రాయపేట మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..

చక్రాయపేట మండలం బాలతిమ్మయ్యగారి పల్లె సమీపంలోని ఓ మామిడి తోటలో ఉన్న సంపులో ఈత కోసం దిగిన ఇద్దరు చిన్నారులు నీట మునిగి మృతి చెందారు. ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన రాముడు (11), లక్ష్మణుడు (9) అన్నదమ్ములు. వీరి తండ్రి చనిపోవడం.. తల్లి దూరం కావడంతో మేనమామ కొండయ్య వద్ద ఆశ్రయం పొందుతున్నారు. కొండయ్య బతుకుదెరువు కోసం బాలతిమ్మయ్యగారిపల్లెలోని భాస్కర్ అనే రైతు మామిడితోటలో కాపాల ఉంటున్నాడు. పిల్లలకు సెలవులు కావడంతో ఆదివారం మేనమామ కొండయ్య ఉంటున్న తోట వద్దకు వచ్చారు. తోటలో పిల్లలు ఆడుకుంటూ ఉండడంతో ఆయన పనిమీద బయటకు వెళ్లారు. సాయంత్రం వచ్చి చూస్తే పిల్లలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. ఎక్కడ ఆచూకీ కనిపించలేదు. అప్పటికే పొద్దుపోయి రాత్రి కావడంతో చివరకు అనుమానం వచ్చి తోటలో ఉన్న సంపు వద్దకు వెళ్లి పరిశీలించాడు. అప్పటికే ఇద్దరు పిల్లలు సంపులో మునిగి మృతి చెందడం గమనించాడు. సంపు చుట్టూ ఉన్న తార్పాలిన్ పట్టకు పాచిపట్టి ఉండడతో బయటకు వచ్చే మార్గం లేక ఇద్దరు జారిపడిపోయి ఊపిరిడక మృతి చెంది ఉండవచ్చని సమాచారం. కాగా, మృతి చెందిన ఇద్దరు పిల్లలను సోమవారం తెల్లవారుజామున వారి సొంత గ్రామమైన ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు తరలించారు. అయితే ఈ సమాచారం చక్రాయపేట పోలీసులకు తెలియడంతో వారు పిల్లల మృతదేహాలను చక్రాయపేటకు తీసుకువచ్చి.. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

● లేకపోతే మూల్యం చెల్లించక తప్పదు ● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధుల డిమాండ్



ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక దీక్షలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీలకు ప్రభుత్వం వెంటనే మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వం తగుమూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సోమవారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. దాదాపు 500 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా 25 మంది నాయకులు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దీక్ష కొనసాగించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నుంచి మల్లు రఘునాథరెడ్డి దీక్షలో పాల్గొన్న మాన్యువల్ కౌన్సెలింగ్‌తో ఉపాధ్యాయులకు కలిగే లాభాన్ని.. అలాగే వెబ్ కౌన్సెలింగ్ వల్ల ఉపాధ్యాయులు కలిగే నష్టాన్ని వివరించారు. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు మొండి వైఖరిని ప్రదర్శిస్తూ ఉపాధ్యాయులకు నష్టం కలిగే విధంగా వెబ్ కౌన్సెలింగ్ చేపట్టడాన్ని ఖండిస్తూ ప్రభుత్వం తనతీరు ఇప్పటికైన మార్చుకోవాలని లేనిపక్షంలో ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులకు గురవుతారన్నారు. కడప జిల్లా ఐక్యవేదిక నాయకులు మోపూరి వెంకటశివారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికి ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకుండా ముందుగానే తీసుకువచ్చి ఈరోజు కేటాయించిన స్లాట్‌ల రూపంలో విద్యాశాఖ అధికారుల మీద ఒత్తిడి తెచ్చి ఉపాధ్యాయులను భయ భ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. ఇలియాస్ బాష మాట్లాడుతూ ప్రభుత్వం మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టకపోతే మంగళవారం విజయవాడ విద్యా భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు గుజ్జల తిరుపాల్, సంగ మేశ్వర్ రెడ్డి, కొండారెడ్డి, అబ్దుల్లా, ఖాదర్ బాష, లెక్కల జమాల్‌రెడ్డి, బత్తిని నాగేశ్వర రావు,అమర్‌నాథరెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేషన్ స్మగ్లర్లపై చర్యలు తీసుకోండి

పౌరసరఫరాల శాఖ మంత్రికి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి లేఖ

పులివెందుల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో రేషన్ బియ్యం స్మగ్లర్లు బరితెగిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి లేఖ రాశారు. ఈ మేరకు ఆయన సోమవారం లేఖను మీడియాకు విడుదల చేశారు. రేషన్ స్మగ్లర్లకు లెక్కలేకుండా పోయిందన్నారు. గత కొన్ని రోజుల క్రితం వరకు విజిలెన్స్ అధికారులు కట్టడి చేసినప్పటికి మళ్లీ వారం రోజులుగా విచ్చలవిడిగా అక్రమ రవణాకు పాల్పడుతున్నారన్నారు. దీనికి కారణం తమరితో (మంత్రి) ఉన్న ఫొటోను వైసీపీకి చెందిన స్మగ్లర్లు కామేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌లు అందరికీ చూపిస్తూ మాకు మంత్రి అండదండలు ఉన్నాయని, మా జోలికి వస్తే అంతు చూస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఇవి నిజమైన ఫొటోలా లేక మార్ఫింగ్ ఫొటోలా అర్థం కాక అధికారులు హడలిపోతున్నారన్నారు. వారిపైన చర్యలు తీసుకోవాలని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు. వారు సర్క్యులేట్ చేస్తున్న ఫొటోలను లేఖతో పాటు జతచేస్తున్నామన్నారు. వీరిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

వేంపల్లె ఈఓ మళ్లీ సస్పెన్షన్

● చక్రాయపేట ఈఓపీఆర్డీ, పోరుమామిళ్ల ఈవో..

కడప, వేంపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఈఓగా పనిచేస్తున్న ఎన్‌వీ సుబ్బారెడ్డి రూ.1.86 కోట్ల పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని ఈ ఏడాది మార్చి 5వ తేదీ కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ రాజ్యలక్ష్మి సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఆయన సస్పెన్షన్‌లో కొనసాగు తుండగా తాజాగా పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఈఓ సుబ్బారెడ్డిని సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీపీఓ రాజ్యలక్ష్మి సోమవారం సుబ్బారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే వేంపల్లె ఈఓగా పనిచేసి ప్రస్తుతం చక్రాయపేట ఈఓపీఆర్‌అండ్ ఆర్డీగా పనిచేస్తున్న భూమిరెడ్డి మల్లికార్జునరెడ్డిని సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఇచ్చిన ఆదేశాలతో డీపీఓ సస్పెన్షన్ వేటు వేశారు. సుమారు రూ.15లక్షల మేర పంచాయతీ నిధులను ఖాతాల్లో జమచేయకుండా నిబంధనలకు విరుద్ధంగా తనవద్ద ఉంచుకున్నారనే ఆరోపణలపై సస్పెండ్ చేశారు. అలాగే గతంలో వేంపల్లెలో ఈఓగా పనిచేస్తూ పోరుమామిళ్లకు వెళ్లిన రవిశంకర్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. ఈయన సుమారు రూ.48లక్షలు పంచాయతీ నిధులు ఖాతాలో జమచేయకుండా ఏడాదిన్నర పాటు తనవద్దే ఉంచుకున్నారనే ఆరోపణలపై డీపీఓ సస్పెండ్ చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆటో వితరణ



ఆటోను నడుపుతున్న ముక్కా, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడుగుంటపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ముక్కా ఫౌండేషన్ అధినేత, కుడా చైర్మన్ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఆటోను విరాళంగా ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌తో కలిసి కళాశాల ప్రిన్సిపాల్‌కు ఆటోను అందించారు. ఈ సందర్భంగా ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలకు వెళ్లాలంటే పట్టణం నుంచి సుమారు 4 కిలోమీటర్లు దూరం వెళ్లాలి. ఈ సమస్యను గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడంతో విద్యార్థుల ఇబ్బందిని గమనించి విద్యుత్ ఆటోను రూ.4 లక్షలతో కొనుగోలు చేసి కళాశాలకు అందజేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి చేసిన ఈ సహాయం అందరికీ స్ఫూర్తిదాయకం అని ప్రశంసించారు. అనంతరం ఆటోను ఎమ్మెల్యే స్వయంగా నడిపి కళాశాల యాజమాన్యంకు అందజేశారు. కార్యక్రమంలో టీడీ పీ యువ నాయకులు ముక్కా సాయి వికాష్‌రెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూలి డబ్బులు అడిగారని దాడి.. ముగ్గురికి గాయాలు

పులివెందుల,జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కూలి డబ్బులు అడిగినందుకు ముగ్గురు వ్యక్తులపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... పట్టణంలోని నగరిగుట్టకు చెందిన సాయిప్రసాద్, సాయి అనే ఇద్దరు కూలీలు విజయేంద్ర, సాయికుమార్‌లను ఆదివారం రాత్రికూలి డబ్బులు అడిగారు. ఈ విషయమై వీరి మధ్య మాటమాటపెరగడంతో సాయి కుమార్, విజయేంద్ర అనే ఇరువురు సాయిప్రసాద్, సాయిలపై దాడి చేశారు. వీరితో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

కోదండరామాలయం వద్ద తప్పిన ప్రమాదం



అగ్నికి ఆహుతి అవుతున్న మొబైల్ మరుగుదొడ్లు

ఒంటిమిట్ట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయం వద్ద పెద్ద ప్రమాదం తప్పింది. టీటీడీ పరిపాలన కార్యాలయం సమీపంలో అగ్ని ప్రమాదం సంభవించింది. గత రెండు సంవత్సరాలుగా తుప్పు పట్టిన మొబైల్ మరుగుదొడ్లు ఉన్నాయి. వీటిని అధికారులు పాతసామన్లకు లెక్కకట్టి విక్రయించారు. సోమవారం సాయంత్రం వాటిని గ్యాస్‌కట్టర్‌తో విడగొడుతుండగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే టీటీడీ విజిలెన్స్ అధికారులు మంటలను అర్పారు. దీంతో టీటీడీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ సమయంలో భక్తులు ఆ ప్రాంతంలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఏడుగురికి రిమాండ్

చాపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.రాజుపాళెం గ్రామానికి చెందిన ఏడుగురి వ్యక్తులను సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టువారు వారికి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో నలసింగు మధు, పెద్దకుళాయప్ప, పవన్, జంగయ్య, కిశోర్, బాబు, క్రిష్ణయ్య ఉన్నట్లు చెప్పారు. గతనెల 27వ తేదీ ఆ గ్రామం వద్ద ఉన్న బంజరు భూమి విషయమై అదే గ్రామానికి చెందిన పల్లెం శ్రీనివాసులు, అతని కుటుంబ సభ్యులు కట్టెలు, మచ్చుకత్తులు, ఇనుపరాడ్లతో ఘర్షణ పడ్డారన్నారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

నేడు అత్తిరాలలో గిరి ప్రదక్షిణ

రాజంపేటటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని అత్తిరాల మహాపుణ్యక్షేత్రంలో మంగళవారం సాయంత్రం ఆరు గంటల నుంచి గిరి ప్రదక్షిణ, గంగాహారతి కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గంగాహారతి, అన్నదానం ఉంటాయని తెలిపారు.

పుంజుకుంటున్న టమోటా ధరలు

● 30 కిలోల టమోటా క్రేట్ రూ.820



అంగళ్లు మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

కురబలకోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా పతనమైన టమోటా ధరలు క్రమేణా పుంజుకుంటున్నాయి. కొద్ది రోజుల క్రితం టమోటా ధరలు పాతాళానికి పడిపోవడంతో కనీసం గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు నష్టాలను చవిచూశారు. అయితే ప్రస్తుతం టమోటా ధరలు క్రమేణా పుంజుకొంటున్నాయి. కొన్ని రోజులుగా కేవలం 30 కిలోల క్రేట్ రూ.70 నుంచి రూ.150 మధ్య పలికింది. క్రమేణా పదిహేను రోజులుగా ధరలు పుంజుకుంటున్నాయి.

కాగా సోమవారం మండలంలోని అంగళ్లు టమోటా మార్కెట్‌లో 30 కిలోల క్రేట్ ధర రూ.820 పలికింది. కొనుగోలు చేసిన టమోటాలను మహారాష్ట్ర, తమిళనాడు, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా ప్రాంతాలకు తరలిస్తున్నారు. రానున్న రోజుల్లో ధరలు మరింతగా పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

లంకమల్లలోని సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్



ఉప్పుల గుంతలో కూంబింగ్ నిర్వహిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

సిద్దవటం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): లంకమల్ల అభయారణ్యంలోని సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించినట్లు సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ ఆదేశాలతో ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రోళ్లబోడు, గొల్లపల్లె, సిద్దవటం ఫారెస్ట్ బీట్‌లలో సమస్యాత్మక, అనుమానిత అటవీ ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించామన్నారు. అటవీ ప్రాంతంలోని సమీప గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనపడితే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం తెలపాలన్నారు. అటవీ సంపద కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అటవీ ప్రాంతాలను ఆనుకుని ఉన్న పంట పొలాల్లోకి వన్యప్రాణులు సంచరిస్తే ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా గ్రామస్థులు వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ఓబులేశు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొనవచ్చు ● దీర్ఘకాలిక వ్యాధులు నయం ● ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం
● మెగా యోగాలో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్


యోగా చేస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్


ములకలచెరువులో యోగా అనంతరం ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



పెద్దమండ్యం బస్టాప్ సర్కిల్‌లో నిర్వహిస్తున్న మానవహారం - రామసముద్రంలో యోగా చేస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు

మదనపల్లె టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యానికి యోగా మార్గమని, దీర్ఘకాలిక వ్యాధులను సైతం కట్టడి చేయవచ్చని, ప్రపంచానికి భారత దేశం అందించిన గొప్పవరమని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జడ్పీహైస్కూల్ మైదానంలో మదనపల్లె మండలం, మున్సిపాలిటి పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, ఉద్యోగులు యోగాంధ్రలో భాగంగా యోగా చేశారు. 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్టణంలో విశేష జనసందోహం నడుమ యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా నిత్యం యోగా సాధన చేయవచ్చని, ప్రతి ఒక్కరి జీవన విధానంలో యోగా చేయడంతో మానసిక ఆందోళన, ఒత్తిడిని అరికట్టవచ్చన్నారు. దైనందిన జీవితంలో యోగా తప్పని సరన్నారు.

● **తంబళ్లపల్లె:** స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. పలు శాఖల మండల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతి నిధులు, నేతలు, విద్యార్థులు యోగాసనాలు వేశారు.

● **పెద్దమండ్యం:** స్థానిక హైస్కూల్‌లో మండల అధికారులు, వివిధ శాఖల సిబ్బంది యోగ చేశారు. ర్యాలీ అనంతర మానవహారంలో తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఎంఈఓలు మనోహర్, రామకృష్ణ, డాక్టర్ ఇమ్మానూయేల్ పాల్గొన్నారు.

● **పెద్దతిప్పసముద్రం:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీప క్రీడా మైదానంలో ఉదయం యోగాంధ్ర నిర్వహించారు. తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ మాట్లాడారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, వెలుగు, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

● **నిమ్మనపల్లి:** యోగాతో మానసిక, శారీరక ఒత్తిడి తగ్గుతుందని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక జడ్పీహైస్కూలో మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు, నేతలు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరనాథ్, ఆర్జీవెంకటేష్ పాల్గొన్నారు.

● **ములకలచెరువు:** స్థానిక క్రికెట్ గ్రౌండ్‌లో అధికారులు, నేతలు యోగాసనాలు వేశారు. అనంతరం ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండులో మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ హరి నారాయణ, తహసీల్దార్ ప్రదీప్, ఎంఈఓ వెంకటరమణ, టీడీపీ నేతలు యర్రగుడి సురేష్, కేవీ రమణ, ముత్తుకూరు మౌల, విజయ్‌కుమార్, రామకృష్ణమరాజు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **వాల్మీకిపురం:** యోగా ద్వారా సంపూర్ణారోగ్యం పొందవచ్చని వాల్మీకిపురం ఎంపీడీఓ మనోహర్‌రాజు పేర్కొన్నారు. యోగాంధ్రలో భాగంగా అధికారులు, అంగన్వాడీ మహిళలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు, యువత కలిసి పురవీధుల్లో ర్యాలీ చేపట్టి గాంధీ బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, డాక్టర్లు సోని, శివాణి, మాలతి, హర్షితారెడ్డి, హిమబిందు, డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, చక్రపాణి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● **పీలేరు, రూరల్:** తీవ్ర ఒత్తిడిని సైతం యోగాతో ఎదుర్కోవచ్చని పీలేరు తహసీల్దార్ భీమేశ్వర రావు, ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన యోగాంధ్రలో వారు మాట్లాడుతూ యోగాలో అనేక ఆసనాలు ఉన్నాయని, ఇందులో ఒక్కో ఆసనం ఒక్కో రకం వ్యాధిని నిర్మూలిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యోగా థెరపిస్ట్ డాక్టర్ పీవీఎస్ లక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓ లతీఫ్ ఖాన్, పీలేరు ఈఓటీ గురుమోహన్, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు, పట్టణ ప్రజలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **గుర్రంకొండ:** ప్రతి మనిషి క్రమం తప్పకుండా యోగాను అనుసరిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఉదయం జడ్పీహైస్కూల్‌లో యోగా నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటేశులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **కలకడ:** ఎంపీడీఓ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో యోగాంధ్ర నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి బాటవారిపల్లె హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మురళీ, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

● **బి.కొత్తకోట:** గట్టు జడ్పీహైస్కూల్ ఆవరణలో యోగా శిక్షణా తరగతులను నిర్వహించారు. ఎంపీడీఓ క్రిష్ణవేణి పర్యవేక్షణలో జరిగిన ఈ యోగా తరగతులకు మండలంలోని వివిధ శాఖల ఉద్యోగులు హాజరయ్యారు. తహసీల్దార్ అజారుద్దీన్, ఐసీడీఎస్, వైద్యం, వెలుగు ఉద్యోగులు, నేతలు రెడ్డెన్న, నరసింహారెడ్డి, నరసింహారెడ్డి, సుధాకరరెడ్డి, వాసు, గుంటికుమార్ పాల్గొన్నారు.


కలకడలో ర్యాలీ...


గట్టు జడ్పీహైస్కూల్ ఆవరణలో....


వాల్మీకిపురంలో నినాదాలు చేస్తున్న అధికారులు, ప్రజలు

'మారెళ్ల' గిరిజనులకు న్యాయం చేయాలి


కేవీపల్లెలో పోలీసు స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నేతలు

పీలేరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం మారెళ్ల పంచాయతీ మంచాలమంద గ్రామంలోని గిరిజన యానాదులకు న్యాయం చేయాలని కేవీపల్లె మండలంలోని పలు ప్రజా సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజనుల భూములపై జరుగుతున్న దౌర్జన్యాలను ఖండిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రెవెన్యూ పోలీసు స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ సుమారు 30 ఏళ్ల కిందట మంచాలమందకు చెందిన గిరిజన యానాదులకు 10.5 ఎకరాల భూమిని అధికారికంగా పట్టాలు జారీ చేశారన్నారు. అప్పటి నుంచి అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణాల వారు ఆ స్థలంలోకి వెళ్లకుండా గిరిజన యానాదులను అడ్డుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కొందరు గిరిజనులు ఆ స్థలంలో నివాస స్థలాలు ఏర్పరుచుకోగా అదే అగ్రవర్ణాల వారు వాటికి ధ్వంసం చేయడమే కాకుండా అడ్డుకోబోయిన ఓ వృద్ధుడు, ఓ యువతిపై దౌర్జన్యం చేశారన్నారు. బాధితులు 11 రోజుల కిందట కేవీపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి న్యాయం జరగకపోవడంతో తాము కలగజేసుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ మేరకు వారు తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి అందజేశారు. స్టేషన్ ముందు నిరసన చేపట్టిన వారితో ఎస్ఐ చిన్నరెడ్డప్ప చర్చలు జరిపారు. వీలైనంత త్వరగా బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నేతలు శాంతించారు. కార్యక్రమంలో ఏపీజీవైఎస్ఎస్ నేతలు గడ్డం శ్రీనివాసులు, జానం గంగిరెడ్డి, కిల్లా విజయ్ కుమార్, బీజేపీ నేతలు నిమ్మనపల్లె పురుషోత్తం, ఏపీఎంఆర్‌పీఎస్ నేతలు ముల్లంగి చంద్రయ్య, గిరిజన నేతలు రాజేశ్, టేకుమంద రెడ్డప్ప, రవీ, వెంకటరమణ, శ్రీనివాసులు, బాలాజీ, పాపమ్మ, విజయ, నారాయణమ్మ, పాల్గొన్నారు.

కామేశ్వరస్వామికి బిల్వార్చన



వాల్మీకిపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీకామేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం విశేష పూజలు జరిగాయి. సోమవారం ఉదయం మూలవర్లకు అభిషేకాలు, కామేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, విష్ణుసహస్రనామ శివసహస్ర నామాలతో బిల్వార్చన, నవగ్రహ మహామృత్యుంజయ హోమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు గోనవరపు శీనాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఈఏపీ సెట్‌లో మదనపల్లె విద్యార్థుల ప్రతిభ


తనూశ్రీని అభినందిస్తున్న హేమంత్‌కుమార్

మదనపల్లె టౌన్, జూన్9(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ చూపారు. స్థానిక శ్రీసిద్దార్థ జూనియర్ కళాశాల డైరెక్టర్ హేమంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈఏపీ సెట్‌లో తమ కళాశాల విద్యార్థిని తనూశ్రీ రాష్ట్రస్థాయిలో 1213వ ర్యాంకు సాధించిందన్నారు. మోక్షజ్ఞరెడ్డి 6604వ ర్యాంకు, మిధున్‌హరిహరన్ 6722వ ర్యాంకు, అల్మాస్ 8801ర్యాంకు, మల్లికార్జున 8821ర్యాంకు, దేదీప్యసాయి 12135ర్యాంకు, జిజ్ఞాస ప్రసన్న 14786 ర్యాంకు సాధించారన్నారు. తనూశ్రీని ప్రిన్సిపాల్ వెంకట రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

కృష్ణారెడ్డి సిద్దార్థ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి

ఏపీ ఈఏపీసెట్‌లో శ్రీకృష్ణారెడ్డి సిద్దార్థ విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఎన్.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో వెంకట సాయి దీపక్ 1777వ ర్యాంకు, సాయి సుధిక్ష 3185వ ర్యాంకు, స్పందన 3341వ ర్యాంకు, జాహ్నవి 7758వ ర్యాంకు, హరిత 8138వ ర్యాంకు, మేఘన 11728వ ర్యాంకు, కావ్యశ్రీ 12862వ ర్యాంకు, రెడ్డిటీనాచౌదరి 13752వ ర్యాంకు సాధించారన్నారు. ర్యాంకర్లను ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

నరసింహస్వామి ఆలయంలో శాంతి పూజలు

పెద్దమండ్యం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పాపేపల్లి నరసింహస్వామి ఆలయంలోని రాజగోపురం వద్ద సోమవారం శాంతి హోమం పూజలను వేదపండితులు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పూర్ణాహుతి సమర్పించారు. వారు మాట్లాడుతూ గత నెల 16వ తేదీన రాజగోపురంపై పిడుగుపాటుకు గోపురంపై వున్న విగ్రహాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. నెల రోజుల కిందటే కొత్తగా నిర్మించిన రాజగోపురం కుంభాభిషేకం పూజలు పూర్తయ్యాయి. దీంతో కొత్తగా నిర్మించిన రాజగోపురం వద్ద మణికంఠ స్వామి ఆధ్వర్యంలో శాంతి పూజలు జరిగినట్లు ప్రజలు వెల్లడించారు.

నేషనల్ ఆర్గనైజేషనల్ జనరల్ సెక్రటరీగా డాక్టర్ సుబ్బారెడ్డి ఏకగ్రీవం



మదనపల్లె, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఫెడరేషన్ ఆఫ్ ప్రైవేట్ హాస్పిటల్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ఇండియా నేషనల్ ఆర్గనైజేషనల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఏవీసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో సోమవారం జరిగిన సంఘ సమావేశంలో స్థానిక చిన్నపిల్లల వైద్యుడు సుబ్బారెడ్డిని ఎన్నుకున్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ ఎన్నిక ద్వారా జాతీయస్థాయిలో మదనపల్లెకు గుర్తింపు వచ్చినట్లైంది. అఖిల భారతస్థాయి బాధ్యత పట్టణానికి దక్కడంపై ఐఎంఏ తరపున పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.వెంకటరమణారెడ్డి, ప్రశాంత్‌గుప్త సుబ్బారెడ్డిని అభినందించారు. ఈసందర్భంగా డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నామీద నమ్మకం ఉంచి ఇంత అత్యున్నతమైన బాధ్యతకు ఎంపిక చేయడం పట్ల ఆయా రాష్ట్రాల ప్రైవేటు హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్ అధిపతులు, డాక్టర్లకు, ఆయా రాష్ట్రాల కేంద్ర పాలిత ప్రాంతాల నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్, అధ్యక్ష, కార్యదర్శులకు ఆఫీస్ బేరర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్‌స్టార్ అవార్డులు


కలెక్టర్ శ్రీధర్ నుంచి అవార్డు అందుకుంటున్న జ్ఞానాంబిక విద్యార్థులు

మదనపల్లె టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి ప్రభుత్వం నుంచి షైనింగ్‌స్టార్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులకు కలెక్టర్ శ్రీధర్ చామకూరి అవార్డులు అందజేశారు. రాయచోటిలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీజ్ఞానాంబిక జూనియర్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. శ్రీసిద్దార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు, శ్రీ కృష్ణారెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థులు కూడా కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్‌స్టార్ అవార్డులు అందుకున్నారు.

భూసమస్యలపైనే విన్నపాలు

మదనపల్లె టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఎక్కువగా భూ సమస్యలపైనే ప్రజల నుంచి విన్నపాలు వచ్చాయి. సోమవారం సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 78 మంది అర్జీలు అందజేశారు. వీటిలో ఎక్కువగా తమ భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కొందరు, భాగపరిష్కారంలో తమకు అన్యాయం జరిగిందని కొందరు, భూముల మ్యుటేషన్‌ను మండలాల రెవెన్యూ అధికారులు ఆలస్యం చేస్తున్నారని మరికొందరు సబ్‌కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ఆయా మండలాల తహసీల్దార్లకు సబ్‌కలెక్టర్ ఫోన్ చేసి, సమస్యలపై విచారించి సహేతుకమైతే ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు.

వేడుకగా బ్రహ్మ రథోత్సవం

కలికిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మరథంలో నృసింహుడు పురవీధుల్లో విహరించారు. స్థానిక పురాతన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు సోమవారం జరిగిన ఉత్సవాల్లో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేశారు. తిరుమంజనం అనంతరం ఆలయంలోనే పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. విశేష కార్యక్రమాల అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి బ్రహ్మరథంలో ఆసీనులైన నృసింహుడు పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను అలరించారు. వైదికులు నరసింహాచార్యులు, మురళీధరాచార్యులు స్వామి వారి కైంకర్యాలు ఆగమ శాస్త్రానుగుణంగా వైభవంగా నిర్వహించారు.

కాంట్రాక్టు కార్మికుల వంటా-వార్పు

ఇంజనీరింగ్ వర్కర్లకు సీపీఎం మద్దతు

మదనపల్లె, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ కాంట్రాక్టు ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం అయిదో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా వంటా-వార్పు చేపట్టి నిరసన చేపట్టారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఇంజనీరింగ్ వర్కర్లను స్కిల్డ్, అన్‌స్కిల్డ్, సెమీ సెమీస్కిల్‌గా గుర్తించి వేతనాలు అమలు చేయాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులకు రూ.21వేలు ఇస్తుండగా, ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ వర్కర్లకు మాత్రం రూ.15వేలే ఇవ్వడాన్ని వారు తప్పుపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే మున్సిపాలిటీలో అత్యవసర సేవలైన తాగునీరు, వీధిలైట్ల నిర్వహణను నిలిపేస్తామని యూనియన్ నేతలు ప్రభుత్వానికి అల్టిమేటమ్ జారీ చేశారు. సీపీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోగా, సమ్మె చేస్తే విధులను నుంచి తొలగిస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నేతలు రామకృష్ణ, రాజన్న, శ్రీరాములు, కృష్ణప్ప, శంకరమ్మ, తులసమ్మ, ఎస్ఎఫ్ఐ నేతలు నరసింహ, అఫ్రీద్, తదితరులు పాల్గొన్నారు.

'రాజధాని మహిళలకు భారతి క్షమాపణలు చెప్పాలి'


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మహిళా నాయకురాళ్లు

మదనపల్లె టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలోని మహిళలను వేశ్యలంటూ కించపరచిన వాఖ్యలను ప్రసారం చేసిన నీలి మీడియా యజమాని వైఎస్ భారతి బేషరతుగా రాజధాని మహిళలకు క్షమాపణలు చెప్పాలని టీడీపీ మహిళా నాయకురాళ్లు డిమాండ్ చేశారు. టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన వారు మాట్లాడుతూ రాజధాని అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ నీలి మీడియాతో మాట్లాడి స్తున్నారని, భారతి సహా, మాజీ సీఎం జగన్ కూడా మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ మహిళలు విజయ, పులి మహాలక్ష్మి, రాటకొండ భారతి, నాగమణి, రెడ్డిభూ, కవిత, లక్ష్మి, యశోద పాల్గొన్నారు.

కేసు నమోదు చేయండి

పెద్దతిప్పసముద్రం/ములకలచెరువు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై వ్యాఖ్యలు చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. టీడీపీ సీనియర్ నేత కట్టా సురేంద్ర నాయుడు, మాజీ ఎంపీటీసీ శేషాద్రి సురేష్, స్కూల్ కమిటీ చైర్మెన్ రాము, పాలగిరి రామాంజులు, గంగులప్ప, సాయి, కల్లూరి బాబు పాల్గొన్నారు.

డిబేట్‌లో చేసిన వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని ములకలచెరువు పోలీసులకు టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మెన్ కేవీ రమణ తదితరులు ఫిర్యాదు చేశారు.

రాత్రికి రాత్రే నిండిన బంగానాయుని చెరువు


వర్షపు నీటితో కళకళ లాడుతున్న బంగానాయుని చెరువు

బి.కొత్తకోట, జూన్9 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో ఆదివారం రాత్రి భారీవర్షం కురవడంతో బంగానాయుని చెరువు రాత్రికిరాత్రి నిండి తెల్లారేసరికి మొరవ పోయింది. చుట్టుపక్కల వున్న వాగులు వంకల్లో నీటి ప్రవాహం కనిపించింది. దీంతో ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయబోర్లలో భూగర్భ జలాలు వృద్ధి చెంది నీటిమట్టం పెరుగుతుందని. పశువులు, పక్షులకు తాగునీటి కొరత తీరుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో మండలంలోని పెద్ద చెరువుల్లో ఒకటైన గుమ్మసముద్రం చెరువులోకి సైతం మోస్తరు నీరు వచ్చి చేరింది. పట్టణానికి ఆనుకుని వున్న కానగలకుంటలోకి రావాల్సిన వర్షపు నీరు హంద్రీ-నీవా కాలువలోనికి వెళ్లిపోయింది. దీంతో చుక్కనీరు కూడా కానగలకుంట లోనికి రాలేదు. దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

మంజునాథకాలనిలో బాలిక మృతి

మదనపల్లె టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మంజునాథకాలనిలో మస్తాని(16) మృతి చెందింది. గఫూర్, హసీనా దంపతులకు మస్తాని కుమార్తె వుంది. సొంత పనుల మీద గఫూర్, హసీనా బయటకు వెళ్లి సోమవారం రాత్రి ఇంటికి చేరుకోగా, ఇంట్లో మస్తాని ఉరేసుకుని వుండడం కనిపించింది. దీంతో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మస్తాని మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసుల దర్యాప్తులో మస్తాని మృతికి గల కారణాలు తెలియాల్సి వుంది.

రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

కలకడ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తోందని టీడీపీ నేతలు అన్నారు. కలకడ, బాలయ్యగారిపల్లెలో జరిగిన వేరుశనగ విత్తనాల పంపిణీలో ఏఓ లావణ్య మాట్లాడుతూ ఖరీఫ్ రైతులు వేరుశనగను పండించడానికి వీలుగా ప్రభుత్వం విత్తన కాయలను రాయితీపై సరఫరా చేస్తోందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. సర్పంచ్ విశ్వనాథ్, నేతలు రైస్‌మిల్ రమణ, ముబారక్, కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.